ఆదివారం
ప్రజాశక్తి
ఆగస్టు 24, 2003





లోకకళ్యాణం
ప్రపంచ వినాశనం → యురేనియం

హ్యాపీ బర్త్‌డే

(24-8-2003నుండి
30-8-2003 వరకు)

డి. తేజశ్రీ
3సం॥, ఆగస్టు-2000
సైదమ్మ-వీరయ్య
ఓగోడు-నల్లగొండ

సుమలత
6సం॥, ఆగస్టు-1997
సులోచన-రామారావు
కీర్తిపాడు-ప్రకాశం

సి. శిరీష
2సం॥, ఆగస్టు-2001
మునీశ్వరి-గురువయ్య
వికృతమాల-చిత్తూరు

టి. తేజస్వి
3సం॥, ఆగస్టు-2000
రజని- శ్రీనివాసరావు
బోనకల్లు- ఖమ్మం

తనుష్య
ఆగస్టు-24
కాంచన-బాలసుబ్రమణ్యం
గిరిపురం-తిరుపతి

పి.వినయ్‌కుమార్
9సం॥, 24. 8. 1994
రాంబాయి-మధు
మహబూబాబాద్-వరంగల్

జి. సమీర
1సం॥, 24. 8. 2002
సుజాత- నరసింహారావు
విజయవాడ

శరణ్య
1సం॥, 25. 8. 2002
శోభారాణి- మల్లికార్జున్
మహబూబాబాద్-వరంగల్

హేమంత కుమార్
ఆగస్టు-25
వెంకటలక్ష్మి- రామయ్య
తిరుపతి-చిత్తూరు

ఆదిత్య
4సం॥, ఆగస్టు- 1999
రాధమ్మ- చంద్రయ్య
బుద్దారం- మహబూబ్‌నగర్

శశికళ
8సం॥, 25. 8. 1995
నిర్మలారాణి-బుజ్జిబాబు
జగ్గయ్యపేట- కృష్ణా



జి. సన్ని
ఆగస్టు- 25
లలిత- శ్రీనివాస్
గాంధ్లీ-కరీంనగర్

వి. కార్తీక్
1సం॥, ఆగస్టు- 2002
చంద్రకళ- శోభన్‌బాబు
వెంకటాపురం- సికింద్రాబాద్

గౌతం
8సం॥, ఆగస్టు-1995
రాధమ్మ- చంద్రయ్య
బుద్దారం- మహబూబ్‌నగర్

వి.మౌనిక
9సం॥, 25.8.1994
సరళ- శ్రీనివాసరావు
తెనాలి-గుంటూరు

పి. మాధవి
6సం॥, ఆగస్టు-27
సుజాత-పోతురాజు
బ్రాడీపేట- గుంటూరు

సందీప్
7సం॥, 28. 8.1996
సత్యనారాయణ
ఉక్కునగరం- విశాఖ

కార్తీక్
8సం॥, 28. 8. 1995
శ్రీదేవి- శ్రవణ్‌కుమార్
మోత్కూర్-నల్లగొండ

సాయిదీపిక
5సం॥, ఆగస్టు-1998
ఇందిర- భాస్కర్
మన్ననూర్- మహబూబ్‌నగర్

మనలో మాట

గురుదేవోభవ....

విద్యనేర్పేవాడు గురుడు!

నేర్చుకునేవాడు శిష్యుడు!

గురుదేవోభవ అన్నారు. గురువు దేవుడ్తో సమానం. కనిపించే దేవుడు. అంచేత ఆ దేవుడ్ని కళ్ళకద్దుకోవాలి! గౌరవించాలి! పూజించాలి!

గురువులు రేపటి పౌరులకు ఊపిరులు!

ఆదర్శ సమాజానికి రూప శిల్పులు!

అభ్యుదయ పథానికి మార్గదర్శకులు!

గురువులు విశాల హృదయులు. తప్పులు క్షమిస్తారు. ఒప్పులు బోధిస్తారు. విద్యార్థి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారు..!

అందుకే–

గురువును సాక్షాత్తు బ్రహ్మ అన్నారు. విష్ణువు అన్నారు. మహేశ్వరుడు అని కూడా అన్నారు!

అల్లాంటి గురువును తీసిపారేస్తే కళ్ళు పోతాయి! తరతరాల నుంచి వినవస్తున్న హెచ్చరిక ఇది! ముత్తాతలు తాతలను హెచ్చరించేరు. తాతలు తండ్రులను హెచ్చరించేరు. తండ్రులు మనల్నీ – మనం మన పిల్లల్నీ హెచ్చరిస్తున్నాం!

ఉపాధ్యాయ వృత్తి ఆషామాషీ వ్యవహారం కానేకాదు. అతడు కేవలం నెల జీతం కోసమే రోజులు లెక్క పెట్టే ఉద్యోగి అస్సలే కాదు. రేపటి పౌరులను తీర్చి దిద్దే మహాయజ్ఞంలో అతడు ముఖ్యపాత్రధారి! నవ సమాజ నిర్మాత!

అందువల్ల –

అతడు ఇంటాబయటా – అందరికీ ఆదర్శ ప్రాయంగా వుండాలి!

అయితే–

కాలక్రమేణా గురువు గుణాల్లో కొన్ని తేడాలున్నాయి. అవి గురు కులానికి చెడ్డపేరు తెస్తున్నాయి. కొందరు రవుడీలూ రాస్కెల్సూ ఉపాధ్యాయుల వేషంతో నల్లబల్ల ముందు నిలబడుతున్నారు. ఆచార్య పీఠాన్ని అవమానిస్తున్నారు!

గురువు పట్ల భయభక్తులు రెండూ వుండవలసిందే!

అందుకు కత్తులూ కొరడాలూ వాడక్కర్లేదు. కాళ్లూ చేతులూ తీసేస్తామని కళ్లెర్ర చేయకూడదు. కళ్ళు పొడి చేస్తామని నోటీసులు పంపనక్కర్లేదు. ఇల్లాంటి దుష్ట చర్యలతో ఆ గురువులు కసాయి మనుషులకు నకళ్ళవుతున్నారు!

పని దొరక్క – గూండాలూ రౌడీలే ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెడుతున్నారో–

లేక –

మేటి గురువుకు నేటి నిర్వచనం ఇదేనేమో తెలీకుండా వుంది!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్‌స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
కథ	. . . 15
క్రీడారంగం	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
ఇంతిసంగతులు	. . . 21
పలుకుబడి	24

ఇంకా...



స్వేచ్ఛలోనే విద్య వికసిస్తుంది

బాలవికాసం . . . 10



శిల్పాలు అపురూపమే కానీ..

టూరిస్ట్‌గైడ్ . . . 16

విలక్షణమైన సాహితీవేత్త 'దాశరథి'

ప్రొఫైల్ . . . 18, 19



స్త్రీ శక్తి – చిన్న పిల్ళి

రియల్ స్టోరీ . . . 22, 23

కార్టూన్ కదంబం


మేము సాధించిన
ఘన విజయాలే!!
అవిశ్వాసంలో...
ఛార్జ్‌షీట్ నేత
గుజరాత్ మారణహోమం, అల్లర్లు
ఆయుధ, శవపేటికల కుంభకోణాలు..
మతోన్మాదం


'సెక్యులర్' విషయంలో...
నేనెప్పుడూ క్లియర్‌గానే ఉంటా..!! బ్రదర్!!


వరల్డ్‌బ్యాంక్‌నుండి.. సార్.. తనని
సెన్స్ డైరెక్టర్‌గా పెట్టిస్తే.. మతో.. సెన్సు
ఆడిస్తాడట..!
టివి పత్రికల్లో కన్నా
బాబు!

✻ సుధాకర్ నర్వనేని

లోక కల్యాణం → యురేనియం ప్రపంచ వినాశనం



దానితో లోకకల్యాణం సాధ్యం. అదే సమయంలో ప్రపంచ వినాశనం కూడా జరిగే ప్రమాదముంది. మంచికోసం ఉపయోగిస్తే అది ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుంది. అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాల చేతిలో పడితే ప్రపంచమే నిర్జీవంగా మారుతుంది. అదే యురేనియం. యురేనియంతో అతి చౌకగా విద్యుత్‌ను తయారు చేసి ప్రజలకు అందించవచ్చు. అదే సమయంలో అణుబాంబులు తయారు చేసి ప్రపంచాన్ని సర్వనాశనం చేయ్యొచ్చు. అది ఉపయోగించే వారి ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. హిరోషిమా, నాగసాకి నగరాలను నాశనం చేసింది ఈ యురేనియం. అలాగే ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజలకు వెలుగులు అందిస్తోంది. చెర్నోబిల్‌లో అజాగ్రత్త వల్ల జరిగిన ప్రమాదంలో యురేనియంపై ప్రపంచ వ్యాప్తంగా చర& ప్రారంభయింది. ఇపుడు మన రాష్ట్రంలో, దేశంలో యురేనియం వెలికితీతపై పలు అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

భారత ప్రభుత్వం 2020 నాటికల్లా 20 వేల మెగావాట్ల అణువిద్యుత్తును ఉత్పత్తి చేయాలని అణుశక్తి సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో ఆరు ప్రాంతాల్లో 14 అణురియాక్టర్ల ద్వారా 2720 మెగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి అవుతోంది. మరో 3960 మెగావాట్ల శక్తిని ఉత్పత్తి చేయగల ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయి. రానున్న రోజుల్లో 13,144 మెగావాట్ల శక్తిని ఉత్పత్తి చేయగల ప్లాంట్లు నిర్మించాలని అణుశక్తి సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దేశంలో లభించే అణువిద్యుత్ ఉత్పత్తి చేయగల పదార్థాలు ఎక్కడ లభించినా వినియోగించుకోవాలని నిర్ణయానికి వచ్చింది. అణుశక్తి సంస్థ అనుబంధ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యుసిఐఎల్) అణుశక్తిని అధికంగా ఇవ్వగల యురేనియం గనుల కోసం అన్వేషణ ప్రారంభించింది. దానిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ జిల్లాలో, మేఘాలయ రాష్ట్రంలోని పశ్చిమకాసీ జిల్లాలో ఉన్న యురేనియం గనులపై దృష్టి సారించింది. ఆదివాసీల నుండి వ్యతిరేకత రావడంతో మేఘాలయ ప్రభుత్వం యురేనియం గనుల తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతి ఇచ్చే దిశగా పావులు కదుపుతోంది. నల్గొండ జిల్లా పి.ఎ.పల్లి మండల పరిధిలోని పెద్దగట్టు, లంబాపూర్ గ్రామాల పరిసరాల్లో ఉన్న యురేనియం నిక్షేపాలకు సంబంధించి ఐదేళ్లు పరిశోధన జరపడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం నిక్షేపాలకు సంబంధించి పరిశోధనలు జరుగుతున్నాయి. కాలుష్య నియంత్రణ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ గనుల శాఖ అనుమతి ఇస్తే మైనింగ్ చేపట్టడానికి యుసిఐఎల్ సిద్ధంగా ఉంది. అనంతరం అక్కడే యురేనియం ప్రాథమిక శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అయితే గనులు ఉన్న ప్రాంతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు, అక్కంపల్లి ప్రాజెక్టు నీరు ప్రవహిస్తుండటంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని పలు సంఘాలు ఈ యురేనియం ప్రాజెక్టునే వ్యతిరేకిస్తున్నాయి. మైనింగ్ పనులు చేసే కార్మికులు, వారి కుటుంబాలు మైనింగ్ వల్ల వెలువడే రేడియోధార్మికత సోకే ప్రదేశాల్లో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని ఆయా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యురేనియం మైనింగ్ జరుపుతున్న జార్కండ్ రాష్ట్రంలోని జాదుగూడ ప్రాంతంలోని పరిస్థితులను ఉదాహరణగా చూపుతున్నారు.

యురేనియం..యురేనియం...

1789లో కనుగొనబడిన యురేనియంకు ప్రపంచవ్యాపితంగా అత్యంత ప్రాధాన్యత ఉంది. హానికరమైన రేడియో ధార్మిక పదార్థమైనప్పటికీ దీని నుండి వెలువడే శక్తి ఎక్కువగా ఉంటుంది కావున అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. జర్మనీకి చెందిన రసాయన శాస్త్రవేత్త మార్టిన్ క్లెప్రాత్ పిచ్‌బ్లెండ్ అనే ముడి పదార్థం నుండి యురేనియం మూలకాన్ని వేరు చేశాడు. పిచ్‌బ్లెండ్‌లో యురేనియంతో పాటు టిన్, టంగ్‌స్టన్, మాలిబ్డనం కలిసి ఉంటాయి. భూమిలోనూ, సముద్ర గర్భాలలోనూ యురేనియం సంబంధిత ముడి పదార్థం లభ్యమవుతుంది. సాధారణంగా భూమిలో లభించే యురేనియం నీటి కంటే 18.7 రెట్లు అధికంగా సాంద్రతను కలిగి ఉంటుంది. ఇది 16 రకాల ఐసోటోపులుగా లభ్యమవుతుంది. అణుశక్తి ఉత్పత్తి చేయడానికి యురేనియం-235, యురేనియం-238 ఐసోటోపుల మిశ్రమాన్ని ఉపయోగిస్తారు. కేంద్రక విచ్ఛిత్తి లేదా కేంద్రక సంలీన ప్రక్రియల ద్వారా యురేనియం అణువును విడగొట్టినప్పుడు గొలుసుకట్టు చర్యలు జరిగి పెద్ద మొత్తంలో శక్తి విడుదల అవుతుంది.

కోర్టుకు వెళతాం - కెప్టెన్ రామారావు

యురేనియం ప్రాజెక్టును నిలిపివేయకపోతే హైకోర్టులో కేసు దాఖలు చేస్తామని మువ్‌మెంట్ ఎగనెస్ట్ యురేనియం ప్రాజెక్టు కన్వీనర్ కెప్టెన్ రామారావు హెచ్చరిస్తున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తామని చెబుతున్నారు. ప్రాజెక్టుపై ఆయన వ్యాఖ్యలు... ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎల్లాపురం రిజర్వు ఫారెస్ట్‌లో ఉంది. రక్షిత అటవీ ప్రాంతంలో మైనింగ్‌కు ఎలా అనుమతి ఇస్తారు? పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం ఏదైనా జంతు సంరక్షణ శాంక్చురీకి 25 కిలోమీటర్ల పరిధిలో పరిశ్రమలు నెలకొల్పకూడదు. ప్రస్తుతం తలపెట్టిన యురేనియం ప్రాజెక్టు రాజీవ్‌గాంధీ టైగర్ శాంక్చురీకి అతిదగ్గరలో ఉంది. అలాగే ప్రముఖమైన నీటిపారుదల ప్రాజెక్టుకు 10 కిలోమీటర్ల పరిధిలో పరిశ్రమలు నెలకొల్పకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ప్రస్తుత ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే సాగర్ నీళ్లు మాత్రం యురేనియం మైనింగ్ ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరం నుండే ప్రవహిస్తున్నాయి. ఇన్ని నిబంధనలు అడ్డు వస్తున్నా ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతి ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. గనులశాఖ మంత్రి ఉమామాధవరెడ్డి కూడా తమ వినతిపత్రాన్ని స్వీకరించినప్పటికీ అనుమతి ఇవ్వడానికే సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం అవుతోంది. యురేనియం కార్పొరేషన్ అధికారులు కూడా ప్రజలను మభ్యపెడుతున్నారు. మైనింగ్ చేయబోయే ప్రాంతంలో ప్రజలకు పనులు దొరుకుతాయనే ఆశ చూపుతున్నారు. దానితో అక్కడి నివాసితులు కొందరు జరగబోయే ప్రమాదాన్ని లక్ష్యపెట్టకుండా ప్రాజెక్టు రావాలని కోరుకుంటున్నారు. వారిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అఖిలపక్షం ఏర్పాటు చేయాలి - బి.వి.రాఘవులు

యురేనియం ప్రాజెక్టుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆయన ఆగస్టు నెల మొదటి వారంలో ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లేఖ పూర్తిపాఠం ఇలా ఉంది.

నల్లగొండ జిల్లా లంబాపురం-పెద్దగట్టు ప్రాంతాల్లో యురేనియం ఖనిజం లభిస్తున్నది. ఈ యురేనియం ఖనిజాన్ని వెలికి తీసేందుకు, గనులను తవ్వడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పూనుకున్నది. వెలికి తీసిన ముడి ఖనిజాన్ని శుద్ధి చేసేందుకు పి.ఎ.పల్లి మండలం దుగ్యాల-మల్లాపురం గ్రామ పరిసరాల్లో శుద్ధి కర్మాగారం స్థాపించడానికి ఏర్పాట్లు చేస్తున్నది. యురేనియం ఖనిజ తవ్వకాల వల్ల, శుద్ధి కర్మాగారం మూలంగా పర్యావరణ, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అనేక మంది నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం మీకు తెలిసే ఉంటుంది. యురేనియం రేడియో ధార్మిక పదార్థం. చాలా ప్రమాదకరమైంది. దీని ప్రభావం వేల సంవత్సరాలు కొనసాగుతుంది. ప్రజలయొక్క ఆరోగ్యం తక్షణం పాడవటమే కాకుండా, జన్యువుల్లో కూడా మార్పులు జరిగి శాశ్వత నష్టాలు జరిగే అవకాశం ఉంది. నాగార్జునసాగర్ జలాశయం పైభాగాన గని, శుద్ధి కర్మాగార ప్రదేశాలు ఉన్నందున యురేనియం మూలంగా సాగర్ జలాలు కలుషితమవుతాయి. అలాగే అక్కంపల్లి రిజర్వాయర్‌లోని నీరు కూడా కలుషితమయ్యే ప్రమాదమున్నది. సాగర్ నదీ జలాలను, అక్కంపల్లి రిజర్వాయర్ జలాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగించే కోట్ల మంది ప్రజలకు రేడియో ధార్మిక ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెపుతున్నారు. హైదరాబాద్ నగరానికి సరఫరా అయ్యే మంచినీరు కూడా యురేనియం ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నది. జార్కండ్ రాష్ట్రంలోని జాదుగూడా యురేనియం ప్రాజెక్టు వలన ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కోట్లాది ప్రజల మీద దుష్ప్రభావం కలిగిస్తుందని భావించబడుతున్న ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత గోప్యంగా అమలు చేయడానికి పూనుకోవడం శోచనీయం. ప్రాజెక్టుకు సంబంధించిన లాభ, నష్టాలను ప్రజలముందుంచి, నిపుణులతో, ప్రజాసంస్థలతో చర్చించి, ఏకాభిప్రాయాన్ని సాధించి, తగిన నిర్ణయం తీసుకోవడం సముచితంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో, ప్రజాసంస్థలతో, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, వాస్తవాలన్నింటినీ వాటి ముందుంచి చర్చించాలని కోరుతున్నాం.

సాధారణ పదార్థాలతో లభించే శక్తి కన్నా లక్షల రెట్లలో యురేనియం నుండి శక్తి విడుదల అవుతుంది. అందుకే దీనికి ఇంత ప్రాధాన్యత. అయితే యురేనియం విచ్ఛిత్తి సమయంలో అనేక రకాల ప్రమాదకర వాయువులు (రేడాన్, గ్జినాన్, హీలియం) కూడా వెలువడుతాయి.

జాదుగూడ ప్రాజెక్టు

ప్రస్తుత జార్కండ్ రాష్ట్రంలో ఉన్న జాదుగూడ ప్రాంతంలో 1957లో యురేనియం గనుల తవ్వకాలు ప్రారంభమయ్యాయి. 1968లో యురేనియం ప్రాథమిక శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. మొదట్లో రోజుకు 250 టన్నుల యురేనియంను వెలికి తీసేవారు. ప్రస్తుతం దాని సామర్థ్యం రోజుకు 2000 టన్నుల పైనే. అయితే జాదుగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలు మైనింగ్, ప్లాంట్ నుండి వెలువడే రేడియేషన్ వల్ల అనేక రోగాలకు గురవుతున్నారని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి. జన్యు సంబంధ మార్పులు ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జాదుగూడలో యుసిఐఎల్ సరైన రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమైంది.

ప్రస్తుత ప్రాజెక్టు

నల్గొండ జిల్లా పి.ఎ.పల్లి మండల పరిధిలోని పెద్దగట్టు, లంబాపూర్ పరిసర ప్రాంతాల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు యుసిఐఎల్ గుర్తించింది. నిక్షేపాలు వెలికి తీయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సూచనప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అయితే కాలుష్య నియంత్రణ సంస్థ, గనులశాఖ అనుమతి ఇస్తే తవ్వకాలు జరపడానికి యుసిఐఎల్ సిద్ధంగా ఉంది. మొత్తం 1337 ఎకరాల్లో యురేనియం ముడిపదార్థం లభ్యమవుతుందని యుసిఐఎల్ గుర్తించింది. దీనిలో 197 ఎకరాలు సాగుభూమి కాగా మిగతాది ఎల్లాపురం రిజర్వు ఫారెస్టు. మైనింగ్ చేయాలనుకున్న ప్రాంతం నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రాథమిక శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రాంతం అక్కంపల్లి ప్రాజెక్టుకు 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. మైనింగ్, ప్రాథమిక శుద్ధి కర్మాగారం వల్ల వెలువడే పదార్థాలు సాగర్, అక్కంపల్లి జలాలను కలుషితం చేస్తాయని పర్యావరణ కారులు, పలు స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యుసిఐఎల్ మాత్రం ప్రమాదం లేదని వాదిస్తోంది. యుసిఐఎల్, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వివరణలు ఒప్పించే స్థితిలో లేవు. పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇక సాగర్ ప్రాజెక్టు, అక్కంపల్లి ప్రాజెక్టు కొంత దూరంలో ఉన్నప్పటికీ నీరు యురేనియం ప్రాజెక్టుకు సమీపం నుండి ప్రవహిస్తోంది. మైనింగ్ ప్రాంతం సముద్రమట్టానికి 400 మీటర్ల ఎత్తులో ఉంది. సాగర్ 180 మీటర్ల ఎత్తులో ఉంది. మైనింగ్ నుండి వెలువడే వ్యర్థాలు సాగర్‌లో కలిసే ప్రమాదం ఉంది. అక్కంపల్లి ప్రాజెక్టు కన్నా ప్రాథమిక శుద్ధి కర్మాగారం తక్కువ ఎత్తులో ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ గాలి ద్వారా మలినాలు నీటిని కలుషితం చేసే ప్రమాదం ఉంది.

ప్రాజెక్టుతో ఇబ్బంది లేదు-యుసిఐఎల్

యురేనియం ప్రాజెక్టు వల్ల ఎటువంటి ఇబ్బందులూ ఎదురవ్వబోవని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) పేర్కొంటోంది. మైనింగ్, ప్రాథమిక శుద్ధి కర్మాగారాల వల్ల ఎటువంటి రేడియో ధార్మికత వెలువడదని వాదిస్తోంది. అవగాహన లేని వారు మాత్రమే తమ స్వప్రయోజనాలకు ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని అంటోంది. మైనింగ్ ప్రాంతంలో గ్రానైట్ బెడ్‌రాక్ ఉంటుంది కావున భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం లేదని ప్రకటిస్తోంది. అక్కంపల్లి ప్రాజెక్టు కూడా మైనింగ్ ప్రాంతాని కన్నా ఎత్తులో ఉంది కావున నీరు కలుషితమయ్యే అవకాశం లేదని పేర్కొంటోంది. టెయిలింగ్ పాండ్‌లో ఉండే ప్రత్యేక లైనింగ్ వల్ల వ్యర్థాలు భూమిలో ఇంకే అవకాశాలు లేవంటోంది. ఖమ్మం

ప్రజాందోళన ద్వారా పరిష్కారం
సురవరం సుధాకరరెడ్డి



యురేనియం ప్రాజెక్టు ప్రజలకు హాని కలిగించేవిధంగా ఉంది. ప్రస్తుతం కోర్టులు కూడా ప్రజల హక్కులకు భంగం కలిగే విధంగా తీర్పులు వెలువరిస్తున్నాయి. కావున కోర్టు వల్ల ఉపయోగం ఉండదు. ప్రజాందోళన ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలి. యురేనియం ప్రాజెక్టు అంశం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్నప్పటికీ ముఖ్యమంత్రి స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏడాది కిందట ప్రాథమిక పనులు చేసుకోవడానికి అనుమతి ఇచ్చినప్పటికీ అన్ని అంశాలను ప్రభుత్వం రహస్యంగా ఉంచడంలో అంతర్యమేమిటి? ప్రభుత్వం, యుసిఐఎల్ కొందరిని ప్రలోభ పెట్టి ప్రాజెక్టు సాధన కమిటీగా ఏర్పాటు చేసి ప్రజలను రెండు వర్గాలుగా విడదీయడానికి కుట్ర పన్నుతోంది. ప్రభుత్వపు దుర్మార్గపు చర్యలను తిప్పి కొట్టి ప్రాజెక్టు పనులు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ప్రమాదాన్ని సిఎం గ్రహించడంలేదు
- అసదుద్దీన్ ఒవైసి

తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆరాట పడుతున్న ముఖ్యమంత్రి భవిష్యత్తులో జరిగే ప్రమాదాన్ని గుర్తించడంలేదు. యురేనియం ప్రాజెక్టు వల్ల కోట్లమంది ప్రజల జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. ఇంత గొడవ జరుగుతున్నా ప్రభుత్వం స్పందిచకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ప్రాజెక్టుకు సంబంధించిన పనులు వెంటనే నిలిపివేయాలి. ప్రజల్లో ఒక చర్చ జరిపి అనంతరం అభిప్రాయసేకరణ జరపాలి. దానికి అనుగుణంగా అన్ని రాజకీపక్షాలతో చర్చించి అనంతరం ఒక నిర్ణయం చేయాలి.

జిల్లా మణుగూరులో ఉన్న భారజల కార్మాగారంలోనూ రేడాన్ వాయువు వెలువడుతోందని, దాని వల్ల రాని ముప్పు ఇప్పుడు ఎలా వస్తుందని ప్రశ్నించింది. కాలుష్య నియంత్రణ సంస్థ నుండి అనుమతి లభిస్తే మైనింగ్ ప్రారంభిస్తామని యుసిఐఎల్ ఛైర్మన్ గుప్తా అంటున్నారు. ప్రాజెక్టు వల్ల అనర్థాలు జరుగుతాయన్నది అపోహలు మాత్రమే అని పేర్కొంటున్నారు.

అనేక దేశాలు అనుమతించడం లేదు-ఫ్రంట్‌లైన్ కాలమిస్ట్ ప్రఫుల్ బిద్వాయ్

ప్రపంచంలో అనేక దేశాలు యురేనియం కాని, ఇతర రేడియో ధార్మిక పదార్థాలు కాని మైనింగ్ చేయడానికి అనుమతి ఇవ్వడం లేదు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం రేడియో ధార్మికతకు భయపడి తమ దేశంలో ఉన్న గనులను సైతం తవ్వడం లేదు. తన దేశంలో నిక్షేపాలు ఉన్నప్పటికీ ఫ్రాన్స్ ఇతర దేశాల నుండి యురేనియం దిగుమతి చేసుకుంటోంది. యురేనియం వల్ల రేడియో ధార్మిక, ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. జార్ఖండ్‌లో పరిస్థితి అధ్యయనం చేశారు. అక్కడ అనేక మంది రేడియో ధార్మిక ప్రభావానికిలోనయ్యారు. జన్యు సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. యుసిఐఎల్ జాదుగూడలో సరైన రక్షణ చర్యలు తీసుకోలేదు. యురేనియం రవాణా సమయంలోనూ సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల మైనింగ్ ప్రాంతంలోనే కాక ఇతర ప్రాంతాలకు కూడా రేడియో ధార్మిక పదార్థాలు విస్తరిస్తున్నాయి. టెయిలింగ్ పాండ్‌ల్లో వ్యర్థాలు నిల్వ చేస్తామని చెబుతున్న యుసిఐఎల్ ఆ టెయిలింగ్ పాండ్‌లను ఎంత కాలం నిర్వహిస్తుంది. రేడియో ధార్మిక పదార్థాల జీవిత కాలం లక్షల సంవత్సరాలు ఉంటుంది. అన్ని సంవత్సరాలపాటు టెయిలింగ్ పాండ్‌లు నిర్వహించడానికి యుసిఐఎల్ సిద్ధంగా ఉందా? నల్గొండ ప్రాంతం కూడా మరొక జాదుగూడగా మారే పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రాజెక్టును అడ్డుకోవాలి.

సమస్యలు అనేకం-కాన్పూర్ ఐఐటి ఫిజిక్స్ ప్రొఫెసర్ సురేందర్ గాడేకర్

రేడియో ధార్మిక పదార్థాలు మైనింగ్ చేయడం వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయని కాన్పూర్ ఐఐటికి చెందిన ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్ గాడేకర్ అంటున్నారు. ప్రస్తుత ప్రాజెక్టుపై ఆయన వ్యక్తం చేస్తున్న అనుమానాలు ఇలా ఉన్నాయి.

మైనింగ్ వల్ల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు రావన్న హామీని యుసిఐఎల్ ఇవ్వగలదా? రేడియో ధార్మికత వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. అయితే ఆసుపత్రి నిర్మిస్తామని యుసిఐఎల్ చెబుతోంది. జాదుగూడలో నిర్మించిన ఆసుపత్రి కేవలం అధికారులకు మాత్రమే ఉపయోగపడుతోంది. సాధారణ కార్మికులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఆసుపత్రిలోకి అనుమతి లేదు. ప్రస్తుత ప్రాజెక్టు అనుబంధ ఆసుపత్రి వల్ల ప్రజలకు ఏవిధమైన ఉపయోగమూ జరగదు. పి.ఎ పల్లి మండలంలో లభ్యమయ్యే యురేనియం నుండి ఎంతమేరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందో యుసిఐఎల్ ప్రకటించగలదా?

రేడియో ధార్మిక పదార్థాలతో ఆరోగ్య సమస్యలు-డాక్టర్ సత్యలక్ష్మి

రేడియో ధార్మిక పదార్థాలతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని రెడ్‌క్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచర్ క్యూర్ ప్రతినిధి డాక్టర్ సత్యలక్ష్మి అంటున్నారు. ఈమె రేడియోధార్మిక పదార్థాల మూలంగా ఎదురయ్యే సమస్యలపై అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో తలపెట్టిన యురేనియం ప్రాజెక్టు అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందంటున్నారు. రేడియో ధార్మిక యురేనియం వల్ల కలిగే సమస్యలు ఆమె మాటల్లోనే...

యురేనియం ఆయువు లక్షల సంవత్సరాల్లో ఉంటుంది. చిన్న యురేనియం కణం కూడా పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి చాలా కాలం పడుతుంది. యురేనియం ప్రాజెక్టు నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు, విషవాయువులు మానవుని ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. యురేనియం మైనింగ్‌లో రేడాన్-222 అనే వాయువు వెలువడుతుంది. రేడాన్ అణువు సగం విచ్ఛిన్నం కావడానికి దాదాపు 3.8 రోజులు పడుతుంది. అంటే ఒక సారి విడుదలైన రేడాన్ వాయువులోని అణువులు పూర్తిగా నాశనమవ్వాలంటే దాదాపు నెలకు పైనే పడుతుంది. సాధారణంగా వాతావరణంలో ఉండే వాయువుల కంటే ఈ వాయువు బరువుగా ఉంటుంది. గాలిలో గంటకు 30 నుండి 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అంటే వాయువు మైనింగ్ ప్రాంతం నుండి సుదూరంగా ప్రయాణించగలదని అర్థమవుతుంది. రేడాన్ వాయువు ఆల్ఫా, బీటా, గామా కిరణాలను వెలువరించే గుణం కలిగి ఉంటుంది. ఆల్ఫా కిరణాలు శరీరంలో ప్రవేశించి చర్మాన్ని పాడు చేయడంతో పాటు ఊపిరితిత్తుల సమస్యలకు కారణమవుతుంది. గాయాలు ఉన్న చోట ఈ కిరణాలు సోకితే అవి తీవ్రమవుతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధ వ్యాధులు ఈ కిరణాల వల్ల వస్తాయి. మహిళల్లో ఉత్పరివర్తనాలు సంభవిస్తే గర్భస్రావం జరగడం జరుగుతుంది. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో తలపెట్టిన ప్రాజెక్టును ప్రజల శ్రేయస్సు దృష్ట్యా నిలిపివేయడం మంచిది.

పబ్లిక్ హియరింగ్‌లోనూ వ్యతిరేకత

కాలుష్య నియంత్రణ సంస్థ నల్గొండ జిల్లా పి.ఎ.పల్లి మండలంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రాజెక్టుకు వ్యతిరేకత వచ్చింది. పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయపార్టీలు, నల్గొండ జిల్లా ప్రజలు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. యుసిఐఎల్ ప్రజాభిప్రాయ సేకరణకు రెండు రోజుల ముందు ప్రాజెక్టు నిర్మించాలనుకున్న పరిసర ప్రాంతాల్లో డబ్బు, మద్యం వెదజల్లి సానుకూల స్పందన తెచ్చుకోవాలని ప్రయత్నించి భంగపడింది. ఎక్కువ శాతం ప్రజలు తమకు ప్రాజెక్టు వద్దని చెప్పడంతో ఖంగుతినడం యుసిఐఎల్ వంతైంది. తరువాత ఒక నివేదిక తయారు చేసి నిర్ణయాలు వెల్లడిస్తామని మాత్రమే యుసిఐఎల్ పేర్కొంది. ●

ప్రభుత్వం కళ్లు తెరవాలి - డి.శ్రీనివాస్

యురేనియం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కళ్లు తెరచి పారదర్శకతతో వ్యవహరించాలి. ప్రాజెక్టుపై భిన్నవాదనలు అనవసరం. ప్రాజెక్టు వల్ల అనేక అనర్థాలు జరుగుతాయి. కావున వెంటనే అనుమతి రద్దు చేయాలి. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న పార్టీలు అభివృద్ధికి వ్యతిరేకమని ముఖ్యమంత్రి ప్రకటించవచ్చు. కాని వాస్తవ పరిస్థితులు చూస్తే ప్రజలకు హానికరంగా ఉన్నాయి. కావున ప్రాజెక్టును వ్యతిరేకించడం అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ప్రభుత్వం యురేనియం ప్రాజెక్టు విషయంలో ఏవిధమైన ప్రకటనలూ చేయడం లేదు. ప్రజలను కాపాడటం తన ధర్మం కాదన్నట్లు ప్రవర్తిస్తోంది. ప్రభుత్వం ప్రాజెక్టు విషయంలో తన వైఖరిని స్పష్టం చేయాలి. అన్ని రాజకీయపక్షాలను విశ్వాసంలోకి తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలి. గతంలో వలే కాక పారదర్శకతతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చ జరపాలి.

మరో జాదుగూడగా నల్గొండ - రవి రెబ్బాప్రగడ

యురేనియం ప్రాజెక్టు నల్గొండ జిల్లాను మరో జాదుగూడగా మార్చే ప్రమాదం ఉందని సమతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు రవి రెబ్బాప్రగడ అభిప్రాయపడుతున్నారు. ఆయన జార్ఖండ్‌లోని జాదుగూడ ప్రాంతంలో ఉన్న యురేనియం ప్రాజెక్టు వద్ద పరిస్థితులు ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు. అక్కడి పరిస్థితి ఆయన మాటల్లోనే...

జాదుగూడలో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రతి ఏడాది దాదాపు లక్షా అరవై వేల టన్నులకు పైగా యురేనియం వ్యర్థాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఉన్న వ్యర్థాలను వదిలే రెండు టెయిలింగ్ పాండ్‌లు నిండిపోయాయి. మరొక టెయిలింగ్ పాండ్‌ను నిర్మిస్తున్నారు. అక్కడి ప్రజలు అనేక రోగాలతో సతమతమవుతున్నారు. వంశపారంపర్యంగా అనేక రోగాలు సంక్రమిస్తున్నాయి. ఆ ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రతి గ్రామంలోనూ దాదాపు 150 మంది పిల్లలు రోగాలబారిన పడ్డారు. ఎముకలు బలహీనపడటం దగ్గర నుండి క్యాన్సర్ వరకు అన్ని రోగాలూ ఆ గ్రామాల్లో విస్తారంగా ఉన్నాయి. ఆదివాసీలు సరైన పౌష్టిక ఆహారం లేక రోగాలబారిన పడుతున్నారని ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రభుత్వ వాదన నిజమే అయితే ఇతర ఆదివాసీ ప్రాంతాల్లో లేని రోగాలు ఇక్కడే ఎందుకు ఉన్నాయనేది ప్రశ్న. యురేనియం మైనింగ్ సమయంలో భూములు కోల్పోయినవారికి నష్ట పరిహారం అందలేదు. ఇస్తానన్న ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యర్థపదార్థాలను ఇష్టం వచ్చినట్లు వదిలేయడంతో ఆ వ్యర్థాలతో దారాలు చేయడానికి మహిళలు పూనుకుంటున్నారు. ఆ సమయంలో వారు రేడియో ధార్మికతకు లోనై అనేక రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి కళ్లతో చూడలేనంత దారుణంగా ఉంది. నల్గొండ జిల్లాకు అదే దుస్థితి ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఐక్యంగా ఉద్యమాలు నిర్మించి ప్రాజెక్టును నిలిపివేయాలి.

* డాక్టర్ టి.ధర్మచంద్ర కుమార్

రక్తంలో ప్లేట్‌లెట్స్

ప్లేట్‌లెట్స్ కణాలనే త్రాంబోసైట్స్ అని కూడా అంటారు. ఈ కణాలు గుండ్రంగా గాని, అండాకారంలోగాని లేదా ద్వికుంభాకార పళ్లెం ఆకారంలో గాని ప్లేట్‌లెట్స్ కణాలలో ముఖ్యంగా కేంద్రకం ఉండదు. వీటి పరిమాణం సుమారు 2.5 మైక్రాన్‌లు ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో 4 నుండి 5 మైక్రాన్‌ల పరిమాణంలో ఉండే ప్లేట్‌లెట్స్ కణాలు కూడా కనిపిస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్స్ కణాలు సహజంగా విడివిడిగా ఉంటాయి. ప్లేట్‌లెట్స్ కణాలు బోన్‌మారో నుండి ఉత్పన్నమయ్యే మెగా కారియో సైట్స్ నుండి ఉత్పత్తి అవుతాయి. ఒక్కొక్క మెగా కారియోసైట్ 20 నుండి 30 మైక్రాన్‌ల వ్యాసాన్ని కలిగి ఉంటుంది. రక్త ప్రసారంలో ఉంబీలి అన్ని కణాల కంటే ఇవి పెద్దవిగా ఉంటాయి. వీటి నుండి ఉత్పన్నమయ్యే ప్లేట్‌లెట్స్ కణాలలో 1/3వ వంతు శరీర అవయవ సహజ గుణం వలన రక్త ప్రసరణ వ్యవస్థలో స్ప్లీన్ (ప్లీహం) గ్రంథి ద్వారా అతి నెమ్మదిగా దొర్లగలవు. మిగతా 2/3వ భాగాలు రక్తప్రసరణలో ఉంటాయి. కొన్ని పరిస్థితుల్లో వివిధ కారణాల వలన స్ప్లీన్ (ప్లీహం) వృద్ధి చెందనపుడు ఎక్కువ మోతాదులో ప్లేట్‌లెట్స్ కణాలు స్ప్లీన్‌లో దాగిపోయి, రక్తప్రసారం తగ్గిపోయి పంపిణీ వ్యవస్థలో ప్లేట్‌లెట్స్ కణాల కొరత ఏర్పడగలదు. ఈ విధమైన పరిణామాన్ని త్రాంబోపీనియా అంటారు.

ప్లేట్‌లెట్స్ కణాలు బ్లడ్‌వెస్సల్స్‌లోని ఎండోథీలియంకు అనగా లోపల ఉన్న పొరకు అండగా ఉంటూ బ్లడ్ వెస్సల్స్‌లో నుండి రక్తం, ధారావాహికంగా స్రవించకుండా ఒక ప్లగ్ వలె అడ్డుకొంటాయి. ప్లేట్‌లెట్స్ కణాల జీవిత కాలం 5 నుండి 9 రోజులు ఉంటుంది. వీటి జీవితకాలం అయిపోయిన తర్వాత ప్లేట్‌లెట్స్ కణాలు స్పీన్‌లోను, ఇతర రెటిక్యులో ఎండోథీలియల్ కణాలలోను నాశనం అవుతాయి. ఒక క్యూబిక్ మిల్లీ లీటరులో 2,50,000 నుండి 4,50,000 వరకు ప్లేట్‌లెట్స్ కణాలు ఉంటాయి. రక్తంలో రోజురోజుకూ ప్లేట్‌లెట్స్ కణాల సంఖ్య మారిపోతూ ఉంటుంది. సాధారణంగా రక్తంలో 100 ఎర్రరక్త కణములకు ఒక ప్లేట్‌లెట్ కణం ఉంటుంది. అందువలన ఈ నిష్పత్తిని 100:1గా పేర్కొనవచ్చు. ప్లేట్‌లెట్స్ కణాన్ని ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌లో పరీక్షించినపుడు కణాన్ని ఆవరించి పలుచని కార్బోహైడ్రేట్ పొర ఉంటుంది.

ప్లేట్‌లెట్స్ కణాన్ని పరీక్షించినపుడు ముఖ్యంగా 2 భాగాలు కనిపిస్తాయి.

1. హైలోమియర్
2. క్రొమాటోమియర్ లేదా గ్రాన్యులోమియర్

1. హైలోమియర్ : ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌లో హైలోమియర్‌ను పరీక్షిస్తే హీమోజీనస్ గ్రాన్యులార్ పదార్థాలు, మైక్రొటూబ్యూల్స్, మైక్రోఫిలమెంట్స్ కనిపిస్తాయి. ఈ మైక్రోఫిలమెంట్స్ త్రాంబోస్థినిన్‌ను కలిగి ఉంటాయి. ఈ త్రాంబోస్థినిన్ ప్లేట్‌లెట్స్ ఆకారాన్ని మార్చుటలో తోడ్పడతాయి.



2. క్రోమాటామియర్ లేదా గ్రాన్యులోమియర్ : దీనిలో అనేక భాగాలుంటాయి.

ఎ) అల్ఫా గ్రాన్యుల్స్ : ఇవి అండాకారంలో గాని లేదా గుండ్రటి ఆకారంలో గాని ఉంటాయి. వీటి పరిమాణం 0.3 మైక్రాన్‌ల నుండి 0.4 మైక్రాన్‌ల వరకు ఉంటుంది.

బి) మైటోఖాండ్రియా : ఇవి 2 నుంచి 3 వరకు ఉంటాయి.

సి) సిడిరో సోమ్స్ : వీటిలో ఐరన్ మూలకం ఉంటుంది.

డి) సిరటోనిన్ కలిగి ఉన్న గ్రాన్యూల్స్ : ఈ రకమైన గ్రాన్యూల్స్‌ను కుందేలు ప్లేట్‌లెట్స్ కణాల్లో సిల్వర్ & గార్డెనర్ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. వీటి పరిమాణం 0.05 మైక్రాన్‌ల నుండి 0.13 మైక్రాన్‌ల వరకు ఉంటుంది. ఈ గ్రాన్యూల్స్ ముఖ్యంగా సిరటోనిన్‌ను కలిగి ఉంటాయి. అవి ఎక్కువగా అస్మోఫిలిక్ లక్షణాన్ని కలిగి

ఉంటాయి.

ఇ) గ్లైకోజెన్ గ్రాన్యూల్స్ : ఇవి కూడా ప్లేట్‌లెట్స్ కణాల్లో కనిపిస్తాయి.

ఎఫ్) రైబోసోమ్స్ : ఇవి కొత్తగా ప్లేట్‌లెట్స్ కణాలలో ఉత్పత్తి అవుతాయి.

జి) సూక్ష్మనాళికలు & కోశాలు : ఇవి కూడా ప్లేట్‌లెట్స్ కణాలలో ఉంటాయి.

ప్లేట్ లెట్స్ కణాల విధులు :

1. ప్లేట్‌లెట్స్ కణాలు రక్తం గడ్డకట్టుటకు కావలసిన థ్రాంబోప్లాస్టిన్ అను పదార్థమును ఉత్పత్తి చేసి రక్తం గడ్డకట్టుటలో తోడ్పడతాయి.
2. ప్లేట్‌లెట్స్ కణాల సంఖ్య రక్తంలో తగ్గినపుడు, ఏవైనా గాయాలు అయినపుడు రక్తం త్వరగా గడ్డ కట్టకుండా రక్తస్రావం ఎక్కువగా జరుగుతుంది. ఒక్కోసారి ఎక్యూట్ ల్యుకేమియా, థ్రాంబోసైటోపీనియా వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు.
3. ప్లేట్‌లెట్స్ కణాలు అగ్లూటినేషన్ - కొయాగ్యులేషన్‌లోనూ తోడ్పడతాయి.
4. ప్లేట్‌లెట్స్ కణాలు రక్తకేశ నాళికల గోడలకు తగినంత బలాన్ని లేదా మందాన్ని చేకూరుస్తాయి.
5. రక్తంలో ప్లేట్‌లెట్స్ కణాల సంఖ్య పెరిగినపుడు పాలీసైథీమియా, క్రానిక్‌మైలో జీనియస్ ల్యుకేమియా వంటి లక్షణాలు కనబడతాయి.

పరీక్షా విధానం

పరీక్షా విధానంలో మొదట చేతివేలికి నీడిల్ ప్రిక్ ఇవ్వడం ద్వారా, రక్తాన్ని ఆర్.బి.సి. పిప్పెట్‌లో 0.5 మార్కు వరకు తీసుకోవాలి. దానికి వెంటనే అదే పిపెట్‌లోనికి ప్లేట్‌లెట్ ఫ్లూయిడ్‌ను 101 మార్కు వరకు తీసుకొని, రక్తం ఫ్లూయిడ్‌ల మిశ్రమాన్ని బాగా కలపాలి. ఆ మిశ్రమంలోని రెండు చుక్కలను న్యూబార్ ఛాంబర్ పై వేసి మైక్రోస్కోపులో పరీక్షిస్తే ప్లేట్‌లెట్స్ కణాలు కనిపిస్తాయి. న్యూబార్ ఛాంబర్‌లో గల గదులలో కనబడుతున్న ప్లేట్‌లెట్ కణాలను లెక్కించడం ద్వారా ఒక క్యూబిక్ మి॥లీ. రక్తంలో అవి ఎన్ని ఉన్నాయో నిర్ణయిస్తారు. ●

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

చిరునామా :

సంపాదకులు,
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్‌నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20



డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ
మెంబర్, హైదరాబాద్

✦ **నేను ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. నాకు చిన్నతనంలో అంటే నేను 3వ తరగతిలో ఉండగా నాకు కంటిలో కర్రపుల్ల గుచ్చుకుంది. ఆ తరువాత నేను పిండి పదార్థాలు తినడంతో నాకు కంటి మధ్యలో పువ్వు వేసినది. అది వేసిన తరువాత నేను స్కూల్‌కు అలాగే వెళ్ళిపోయాను. ఏ డాక్టర్ మాకు అందుబాటులో లేనందున, నేను ఆ కంటితో అలాగే ఉండిపోయాను. కొన్నాళ్ళకు ఆ కంటి చూపు అంటే 5వ తరగతి నుండి ఇప్పటివరకు నాకు ఆ కంటిచూపు దెబ్బతిన్నది. దాని గురించి మీ సలహా అందించాలని కోరుకొంటున్నాను.**

- పి.జె.రాజు, పాడేరు.

మీ చిన్నతనంలో కంటికి తగిలిన గాయాన్ని అశ్రద్ధ చేయడంతో, 'కార్నియల్ అల్సర్' ఏర్పడి కంటి చూపు దెబ్బతింది. మీరు కంటి నిపుణుల్ని సంప్రదించి కంటి చూపును కొంతైనా తిరిగి పొందే అవకాశముందేమో కనుక్కోండి. మీరు తెల్లరేషన్ కార్డు వుంటే L.V.Prasad Eye Instituteని సంప్రదించండి. ఇకపోతే పిండి పదార్థాలు తినడం వల్ల కంటిలో పువ్వు రాలేదు. మనం రోజూ తినే అన్నమూ పిండి పదార్థమే.

✦ **డాక్టర్‌గారూ! నాకు తరచూ కడుపు నొప్పి. ఇది వచ్చినపుడే వెనక నుండి నడుము బాగా గుంజుతుంది. కదలలేకపోతాను. విపరీతమైన బాధ. ఇలా రాబట్టి ఆరు నెలలు. ఇదివరకు అసలు కడుపు నొప్పంటే తెలీదు. కాని ఆరు నెలలుగా ఇలా కడుపునొప్పి వేధిస్తోంది. ఈ కడుపు నొప్పి ఒకసారి కిందికి వంగడం వల్ల కూడా మొదలవుతుంది. నేను ఒక విద్యార్థిని. ఆర్థికంగా పేదవారం. కాబట్టి చూపించుకోలేక మీ సలహా కోసం ఈ లెటర్ రాస్తున్నాను. దయచేసి ఈ బాధకు తరుణోపాయం చూపండి. మీ అమూల్యమైన సలహా కోసం ఎదురు చూస్తుంటాను.**

- వీరమల్ల రమాదేవి, హైదరాబాద్

మీరు కడుపు నొప్పిని గురించి పూర్తి వివరాలు రాయలేదు. మీరింకా విద్యార్థినంటున్నారు. కాబట్టి వయస్సు 25 సంవత్సరాలలోపు అని ఊహిస్తున్నాను. ఈ వయస్సులో అనేక కారణాల వల్ల కడుపునొప్పి రావచ్చు. మీరు ముందుగా ఓ స్త్రీ వ్యాధి నిపుణురాల్ని (GYNAE-COLOGIST) సంప్రదించండి. ఒక అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకున్నాక దానిని బట్టి ఏం చేయాలో నిర్ణయించవచ్చు. మీ సమస్య చిన్నదే కావచ్చు. పరిష్కారం తప్పకుండా వుంటుంది. ఏ పెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా ఈ సేవలు లభిస్తాయి.

✦ మాకు ఒక్కడే బాబు. అన్ని టీకాలు, పోలియో చుక్కలు వేయిస్తున్నాము. మా బాబుకు చిన్న చిన్న గాయాలు ఎక్కువగా అవుతున్నాయి. అవి వున్నప్పుడల్లా టి.టి. ఇంజక్షన్ వేయిస్తాము. అలా ఎన్నిసార్లు చేయించాలి. ఎక్కువసార్లు వేయించితే నష్టమేమైనా ఉందా? అప్పుడప్పుడు చేయించే ఇంజక్షన్‌లు ఏమైనా ఉన్నాయా? వాటి షెడ్యూల్ తెలియజేస్తే మా బాబును నిర్భయంగా కాపాడుకుంటాము.

- రాధా కృష్ణ, పామూరు

పుట్టిన మూడు నెలలలోపు మూడు డోసులు, 18 నెలలు. 5 సంవత్సరాల వయసులో బూస్టర్ డోసులు వేయించాక, మూడు సంవత్సరాలకోసారి టి.టి. టీకా ఇప్పిస్తే టెటనస్ అనే వ్యాధి నుండి రక్షణ లభిస్తుంది. అంతేగాని దెబ్బతగిలిన ప్రతిసారీ టీకా ఇప్పించనవసరం లేదు. (ఎక్కువ సార్లు వేయిస్తే నష్టమేమీ లేదుగాని, లాభం కూడా లేదు)

❋ ముదిగంటి సుజాతారెడ్డి

వాగ్దానాల బలం

ఊర్నుంచి మా ఎమ్.ఎల్.ఏ. మామయ్య వచ్చాడు.

"ఏం మామయ్యా! చాలా రోజులైంది పట్నం రాక - అంతా క్షేమమేనా?" అడిగాన్నేను.

"ఆ.. అంతా క్షేమమే అమ్మాయి! తీరిక లేక పట్నం మొకాన రాలేదు" అన్నాడు సోఫాలో కూర్చుంటూ మామయ్య. అతని బరువుకు సోఫా కుయ్యిమంటూ అణిగిపోయింది.

"అంతగనం ఏ పనులు మామయ్యా!" ప్రశ్నార్థకంగా చూశాను మామయ్య వైపు.

"ఎలక్షన్లు వస్తున్నాయి గద..." ఆగాడు మామయ్య.

"ఆ! ఎలక్షన్లా!... ఎలక్షన్లు నా లెక్క ప్రకారం ఇంకో సంవత్సరానిగ్గాని రావాలి..."

"అంతే! సంవత్సరానికే కాని ఇప్పట్నుంచే కష్టపడాలి గద..." "ఇన్నాళ్ళు ఏ కష్టం చేయని వాడు మామయ్య నోట్లోంచి వచ్చిన మాట విని నవ్వాన్నేను.

"ఏమిటి ఏమైన ప్రజాసేవ చేస్తున్నావా ఓట్లు పడాలని.." చిలిపిగా నవ్వాన్నేను.

"ప్రజా సేవే అనుకో. మీటింగులు పెట్టాలి... ప్రజలను కలుసుకోవాలె.. లేకపోతే మన మొఖం ప్రజలకు గుర్తెట్ల వుంటుంది చెప్పు!" నవ్వుతూ అన్నాడు మామయ్య.

"అది సరే మీటింగులు పెట్టి ఏం చేస్తున్నారు! ఏమైనా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?"

"సహాయ కార్యక్రమాలే అనుకో.." నీళ్ళు నమిలాడు మామయ్య.

"అబ్బ! సరిగ్గా చెప్పరాదు మామయ్యా!" విసుగ్గా అన్నాన్నేను.

"మీటింగులు పెట్టడానికి.. అంటె ప్రజలను సభలకు చేరవేయడానికే బోలెడు పైస ఖర్చవుతున్నది. మీటింగులు అంటే ఏమనుకున్నావ్! ప్రజలూ తెల్వి మీరిపోయారు. మీటింగులు అనగానే -ఏమిస్తారు? ఎంతిస్తారు? - అని అడుగుతున్నారు. ప్రజా నాయకుల జీవితాలు మునుపటిలా లేవు సుశీ!" అన్నాడు మామయ్య కాస్త విచారంగా.

"ఇంతకూ మీటింగులు పెట్టి ఏం చేస్తున్నావ్ మామయ్యా!" అడిగాన్నేను.

"మీటింగులు పెట్టి ప్రజలకు వాగ్దానాలు చేస్తున్నాం. మమ్మల్ని... అంటే మమ్మల్ని, మా పార్టీని గెలిపిస్తే.. అదే ఓట్లు మాకే వేస్తే మీకు అవి ఇస్తాం ఇవి ఇస్తాం అని వాగ్దానాలు చేస్తున్నాం"

"ఓస్! అంతేనా! వాగ్దానాలేనా? మంత్రాలకు చింతకాయలు రాలతాయా ఎక్కడైనా. ఇంతకుముందే అన్నావు మామయ్యా! ప్రజలు తెలివి మీరి పోయారని. వాగ్దానాలకే ఏం ఓటేస్తారు మీకు. ఏదైన గట్టి పని చేసి చూపించండి. మీరు గెల్చినప్పట్నుంచి చేసింది వాగ్దానాలే. మళ్ళా అవే వాగ్దానాలు చేస్తే వాళ్ళేం కదులుతారు!" అనుమానం ప్రకటించాన్నేను.

"నీకు తెలియదమ్మాయి! వాగ్దానాల్లో చాలా బలముంటుంది. వాగ్దానాలతోనే గద ఇన్నేండ్లు ఎలక్షన్లు గెలుచుకుంటు వస్తున్నాం. ఇపుడూ అంతే "నవ్వాడు మామయ్య "వాహ్! మామయ్యా! ప్రజలకేమీ చేయకున్నా ప్రజలకన్నీ చేస్తున్నామని ఈ వాగ్దానాల బలంతోనే గెలుస్తున్నారన్నమాట!" ఆశ్చర్యం వెలిబుచ్చాన్నేను.

"అమ్మాయి! ప్రజల నాడి పట్టుకోందే ఏ పనీ కాదు. అది తెలుసుకో! నకిలీ విత్తనాలు కొని నష్టపోతున్నా, కరెంటు, ఎరువులు పురుగు మందుల కోసం అప్పుల పాలవుతున్నా, వర్షాల్లేక, నేల అడుగున నీళ్ళు లేక అవస్థలు పడుతున్నా నిమ్మలంగా ధైర్యంగా వున్నది రైతులే! రైతంటె ఎవరనుకున్నవ్! ఈ దేశానికి వెన్నెముక! అన్నదాత! కష్టించి ఫలం కోసం ఎదురు చూడని గొప్ప కర్మయోగి! అందుకే సాక్షాత్తు శ్రీకృష్ణుడు చెప్పిన మాటలతోనే రైతులకు ధైర్యం చెప్తున్నాం. వాళ్ళ వల్లనే ఈ దేశం నిలిచి వున్నదని మీటింగుల్లో తెలియజెప్తున్నాం. అటువంటి రైతులకు న్యాయం చేకూర్చాలనే మేం ఆలోచిస్తున్నాం. ఇప్పట్నుంచి రైతులకే ప్రాధాన్యమిస్తాం అని నొక్కి చెప్తున్నాం" ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు మామయ్య. నేను కళ్ళు విప్పార్చి మామయ్య వైపే చూస్తున్నాను.

"మామయ్యా! దేశంలో తొంభైశాతం పల్లెటూర్లున్నాయి. దేశం ప్రధాన వృత్తి వ్యవసాయం. రైతు బాగు పడితేనే దేశం బాగుపడుతుంది - అని చిన్నప్పుడు చదువుకున్నట్లు జ్ఞాపకం. అయితే మీరూ మీ పార్టీ వాళ్ళూ ఇంకో సంవత్సరమో ఆర్నెల్లకో ఎన్నికలు వస్తాయి అని తెలిసేంత వరకు రైతును గురించి ఆలోచించనే లేదా! నువ్వూ రైతువే కద మామయ్యా. ఇన్నాళ్ళ పరిపాలనలో ఏం చేశారు మీరు ? సాధించిన అభివృద్ధి ఏమిటో మరి!" తెల్లబోతూ అడిగాన్నేను "అదే తప్పయింది సుశీ! రైతు లేందే రాజ్యం లేదు అని ఇప్పటికైనా తెలుసుకున్నాం సంతోషించు!" అంటూ మామయ్య వెంటనే గంభీరంగా మారాడు.

"అందుకే ఈసారి ఎలక్షన్లో రైతునాదుకోవడమే మా ధ్యేయం!-అని ప్రకటించి వాగ్దానం చేస్తూ ప్రచారం చేస్తున్నాం!" అని విజయానికి గుర్తుగా రెండు వేళ్ళను 'వి' ఆకారంగా ఎత్తి పట్టుకొని చిరునవ్వు నవ్వాడు మామయ్య. ఈ వాగ్దానం అన్ని వాగ్దానాల లాంటిదే అని నిట్టూర్చాన్నేను. ●

మరణ వాఙ్మూలం

మొన్ననే... స్వతంత్రమొచ్చాక
రామున్ని చంపి రావణుడు అధికార పీఠాన్నెక్కాడు.
సమ్మె చేస్తున్న మహాత్మున్ని నడిరోడ్డులో ఉరితీశారు.
బావిలో తేలుతున్న శవం భగత్‌సింగ్‌దేనని తేలింది.
టెర్రరిస్టుగా సుభాస్‌బోసు లాకప్‌లో హతమయ్యాడు.
పోరాటం పూర్తయిందనుకున్న మరుక్షణం నుంచే
రణరంగపు ఆహ్వాన గీతం చెవుల్లో గింగురుమంది

* * *

నా దేశం..., నా ప్రజలూ...
అంతా వికలాంగులే.
అందరూ రెక్కలు తెగిన వాళ్ళే.
నాలుగురోడ్ల కూడలిలో నిలబడి చూస్తే
అంతే... రక్తమాంసాల్లేని పరాజితుల కంకాళాలే.
రక్తం రుచి ఎరుగని వాడికి
రాజకీయాల్లో టికట్లు లేవు.
తలాడించే వాడికి తరతరాలూ తులాభారాలే.
తలెత్తితే... తలలు తెగవచ్చు.,
ఉరికొయ్యల మీద శిరస్సు ఊయలలూగనూ వచ్చు.
సరసంతో సరిపెట్టుకోవాల్సిందే...
'విరసం'లోకి దిగితే, ఇనుపడేగలు ఉక్కుపంజరాల్లోకి ఈడ్చుకుపోతాయి.
అందుకే... నేను మిగలాలంటే భస్మీపటలం కావటవే శరణ్యం.
నేను గెలవాలంటే, ఆత్మహత్య చేసుకోవటం తప్పనిసరి.

* * *

నిన్న...,
జైల్లో ఖైదీయై జనాన్ని జనరంజకంగా పాలిస్తున్న వాడొకడు
రాక్షసులకు రంపపు కొరడాలిచ్చి
రాబందులకు ఉక్కు ముక్కులనమర్చి
ఓటర్ల కాన్‌సంట్రేషన్ క్యాంపులకు కాపలా పెట్టాడు.
చచ్చేవాళ్ళే కానీ, బ్రతికేవాడెవడూ లేడు.
నేను, నాకు నేనుగా చావకపోతే
ఈ అతి స్వతంత్ర భారతీయుల
అమానవీయ రాక్షస క్రియలకు శిధిలం కాక తప్పదు.
గెలవాలంటే..., నేను చావక తప్పదు.

* * *

ఇవ్వాళ..., తమిళనాట...
"పురిచ్చితలైవి" పడగ విప్పిన మిన్నాగైంది.
పాలుపోసిన వాడికి ఏమీ పాలుపోవటం లేదు.
పారిశ్రామిక వివాదాల చట్టాన్ని
న్యాయదేవత కళ్ళకు గంతలుగా కట్టి,
'ఎస్మా'తో కాళ్ళకు కర్కశ పాశాలు చేసి
రెండు లక్షల ఏనుగుల్ని పీనుగుల్ని చేసింది.
గరళ కంఠుల బందిఖానాల్లో
ధర్మగంటలన్నీ ఉరిపోసుకున్నాయి.
మోగించటానికి ధర్మగంటలేవీ..?

అమ్మగారి వంధిమాగధులు, బాకారాయుళ్ళూ
మర్యాదరామన్నలూ, సుప్రీందాసులంతా
భేష్! నీ సాహసం చిరస్మరణీయం అంటూ
మరణవాఙ్మూలాలిచ్చి తరిస్తున్నారు.
ఓడిపోయే వాడే తప్ప గెలిచేవాడెవడూ లేడు
బ్రతికి వున్న వాడెవడూ ప్రాణాలతో లేడు.
పుట్టే ప్రతివాడూ ఆత్మహత్యకు పథకం వేసుకోవాల్సిందే.

బందిపోట్లకు ఊడిగం చేయటానికి
రాజకీయులు సంస్కరణల్ని చంకనెత్తుకున్నారు.
నాగరికం ఆటవికంగా పరివర్తనం చెందుతోంది.
భారతావనిని అంగట్లో 'అణా' పైసలకు అమ్మబోతున్నారు.

అందుకే... నాకు ఆత్మహత్య చేసుకోవాలనుంది
బతకాలంటే ఆత్మహత్య చేసుకోక తప్పదు.
ఈ ఆత్మహతం కాకపోతే...,
అనుక్షణం హతమవుతున్న జీవచ్ఛవాల్ని
బతికించే మార్గం కనిపించటం లేదు.
కొత్త ఎత్తులు వెయ్యాల్సిందే..
కొత్త సూర్యున్ని చూపి, వెలుగు ప్రసరింపజేయాల్సిందే.
అందుకే... నాకు ఆత్మహత్య చేసుకోవాలని వుంది
కొత్త ఆయుధంతో, కొత్త ఆర్తితో వస్తాను.
సెలవ్...!

(నేపథ్యం : తమిళనాట ఉద్యోగులపై ప్రభుత్వ, న్యాయస్థానాల వికృత వర్తన)

- మోటపలుకుల రమేష్



* పుప్పాల కృష్ణమూర్తి

స్వేచ్ఛలోనే విద్య వికసిస్తుంది

"మా వాడ్ని భలే స్కూల్లో చేర్చానండి" అని చెప్పాడు ఏడాది క్రితం మనోహర్.

"ఏం స్కూలు" అనడిగాను.

"బ్లూమూన్" అని ఇంగ్లీష్ మీడియంలే. సిటీలో వుంది. చాలా స్ట్రిక్ట్. పేరెంట్స్‌ని కూడా ఎక్కువ రానీయరు స్కూల్లోకి. ఆదివారం ఒక గంట అంతే. ప్రతి ఒక్కటీ టైం ప్రకారం జరగాల్సిందే ఉదయం లేచిన దగ్గర్నించీ రాత్రి పడుకునే దాకా అన్నీ సిస్టమేటిక్. ఆటల టైంలో కూడా చదివిస్తారట. టీవీ అన్నమాట లేదు. స్టేట్ ర్యాంకుల కోసం బాగా చదివిస్తున్నార్లే. మిగతా స్కూల్స్ కంటే రెండు వేలు ఎక్కువైనా అందులోనే చేర్పించా బోర్డింగ్‌తో" అన్నాడు.

మొన్న ఓ సమావేశంలో కలిసినప్పుడు మాటల సందర్భంలో అడిగాను "మీ వాడి చదువు ఎలా ఉంది" అని.

"ఎందుకోనండి. ఆశించినంత ప్రోగ్రెస్ లేదు. ఒకటే తలనొప్పి అంటున్నాడు. డాక్టర్‌కు చూపిస్తే, నిద్ర తక్కువై వస్తోందన్నాడు. మందులు రాసిచ్చాడు. 'అవి వేసుకుంటే నిద్ర వస్తోంది. చదువుతుంటే కళ్ళు మూతలు పడ్తున్నాయి' అంటున్నాడు. హాస్టల్ ఫుడ్ కూడా పడ్డం లేదు. బాగా వీకయ్యాడు. చచ్చినా ఆ స్కూల్లో చదవనంటున్నాడు" కాస్త బాధగా చెప్పాడు.

"పిల్లలకు స్వేచ్ఛ లేకుంటే విద్య ఎలా అబ్బుతుంది? వాళ్ళేమైనా కంప్యూటర్లా?" అన్నాను.

"నిజమేనండి డబ్బు ఖర్చయింది. ఆరోగ్యం పోయింది. చదువులో ఇంప్రూవ్‌మెంట్ లేదు. వచ్చే ఏడు మా వద్దే ఉంచి చదివిద్దామనుకుంటున్నాం" అన్నాడు.

విద్యార్జన ప్రధానంగా మానసికమైనది. అయినా శారీరకంగా ఆరోగ్యంతో వున్న వారే మానసికంగా ఆరోగ్యంగా ఉండగలుగుతారు. శరీర ఆరోగ్యంతో పాటు స్వేచ్ఛాయుతమైన వాతావరణం, చక్కటి ఆహారం, ఆటలు, తగినంత నిద్ర, పెద్దల ప్రేమ, విద్యలో ప్రోత్సాహం మొదలగునవి బాలలకు ఎంతో అవసరం. ఇందులో ఏ అంశం లోపించినా, మానసికంగా నలిగిపోతుంటారు. మనసు స్వచ్ఛంగా, ఉత్సాహంగా లేని విద్యార్థి చదువు పట్ల పూర్తి ఏకాగ్రతను నిలుపలేడు. అందువల్ల చదువులో వెనుకబడిపోతుంటాడు. క్రమేపీ చదువు పట్ల నిరాసక్తత పెంచుకుని, విద్యకు దూరమవుతాడు. దాదాపు తల్లిదండ్రులంతా తమ పిల్లలు బాగా చదవాలి, ఫ్రీసీట్లు రావాలి. మంచి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరాలి' అని ఆశపడుతుంటారు. అది తప్పు కాదు కాని అందుకు తగిన వాతావరణం కల్పించడం, విద్యార్థి శక్తిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థిపై ఒత్తిడి పెరిగి చదవనని మొండికేస్తుంటారు. కొంతమంది స్కూల్స్ నుంచి పారిపోతే, మరికొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

చాలా ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకే మాత్రం స్వేచ్ఛ ఉండడం లేదు. క్లాసులో పాఠాలు వినిపించి, వాటినే తిరిగి బట్టీ పట్టించి రాయించడం లేదా బండెడు హోంవర్క్ ఇచ్చి అర్ధగంట ఆడుకునే టైము కూడా లేకుండా చేస్తున్నారు. మనసుకు హత్తుకునేలా బోధన ఉండటం లేదు. విద్యార్థులకు శాస్త్రీయ పద్ధతులలో బోధన చేయరు. ర్యాంక్‌ల పేరుతో సంవత్సరం పాటు బోధించాల్సిన సిలబస్‌ను ఆర్నెల్లలో దులిపేసి, మిగతా నాలుగు నెలలు బట్టీ పట్టిస్తుంటారు. మరికొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు పిల్లల మార్కుల ఆధారంగా ఏ, బి, సి గ్రేడులుగా చేసి, ఒకరినొకరు కలవకుండా చేసి, సి కంటే బి ఎక్కువ బి కంటే ఏ ఎక్కువ అని విద్యార్థుల్ని విభజించి, ఒకరిపట్ల ఒకరు ద్వేషం పెంచుకోవడానికి కారణమవుతున్నాయి. ఇటువంటి నిర్బంధం, అవమానం, భయాల మధ్య చదువంటేనే విద్యార్థికి అసహ్యం పెరిగేలా చేస్తున్నారు.

టీచర్ల, తల్లిదండ్రుల బాధ భరించలేక పుస్తకం పట్టుకుని చదువుతుంటారే కాని మనసుకు ఎక్కదు. 'మావాడు ఎప్పుడూ చదువుతూనే ఉంటాడు' అని పేరెంట్స్ మురిసిపోతే, మా సంస్థలో పిల్లల్ని పదిగంటల పైన్నే చదివిస్తున్నాం' అని ఘనంగా చెబుతుంటారు ప్రిన్సిపాళ్ళు. బుర్రలోకి ఎంత ఎక్కుతుందో, అసలు ఎక్కడానికి అవకాశం ఉందో లేదో ఆలోచించరు. ఇంత చదివిస్తున్నా మార్కులు రావడం లేదని పిల్లల్ని పెద్దలు తిట్టడం, కొట్టడం లేదా బాధపడటం చేస్తుంటారు. ఇదెలాంటిదంటే స్వేచ్ఛగా తిరిగే కోకిలను పంజరంలో పెట్టి, రకరకాల పండ్లు పెట్టి, కూయమనడంలాంటిది. అడవిలో స్వేచ్ఛగా తిరిగే విహంగంలా పాఠశాలలో విద్యార్థులు విహరించగలగాలి. ఇష్టమైన స్వీటు తింటున్నంత ఆనందంగా విద్యార్థి చదువుకోగలగాలి. బెంగ, బెరుకు, భయం, ఒత్తిడి, నిర్బంధం పిల్లల్ని బాధించ కూడదు. పువ్వులోకి మకరందం సమకూరినంత సులభంగా విద్యార్థుల్లో విజ్ఞానం ప్రోది కావాలి. అలా నేర్చుకున్నదే అసలైన విద్య. ●

మొలకలపల్లి కోటేశ్వరరావు

మార్పు

రాము, గోపి ఒకే స్కూల్లో పదవ తరగతి చదువుతున్నారు. రాము పేద కుటుంబానికి చెందినవాడు. తల్లిదండ్రులు కూలిపనిచేసుకుంటూ అతనిని చదివిస్తున్నారు. అది గమనించి రాము కూడా బాగా చదువుతూ అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటుండేవాడు. అందుకే రాము అంటే టీచర్లందరికీ ఇష్టం.

గోపి ధనవంతులబ్బాయి. తల్లిదండ్రులు గోపికి అడిగినంత డబ్బులిస్తుండేవాళ్లు. ఆ డబ్బుతో సినిమాలు చూస్తూ, సిగరెట్లు తాగుతూ చెడు అలవాట్లు నేర్చుకున్నాడు. క్లాసులో అందరికంటే తక్కువ మార్కులు వస్తుండేవి. క్లాసులో అల్లరిపిల్లాడుగా గుర్తింపుపొందాడు గోపి.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు జరిగాయి. అందులో రాముతో పాటు, గోపీ కూడా పాల్గొన్నాడు. రాముకి మొదటి బహుమతి లభించింది. గోపీకి ఏ బహుమతీ రాలేదు. 'గోపీ! నీవు రాముతో పోటీలో పాల్గొనడం బాలేదు. నీవు మొద్దువి. రాము తెలివిగలవాడు' అని అందరూ ఎగతాళి చేశారు. దాంతో రాము అంటే విపరీతమైన కోపం వచ్చింది.

రాము పేదవాడు కాబట్టి నాసిరకం బట్టలు వేసుకునేవాడు. గోపి ఆ బట్టల్ని తన స్నేహితులకు చూపించి ఎగతాళి చేస్తుండేవాడు. రాము ఏ మాత్రం బాధపడకుండా మౌనంగా వుండేవాడు.

ఓ రోజు సాయంత్రం స్కూలు అయిన తర్వాత రాము తన ఇంటికి బయలుదేరాడు. వాళ్ల ఇల్లు ఊరు చివర వుంటుంది. కొంతదూరం జన సంచారం పెద్దగా వుండదు. గోపి తన మిత్రులతో కలిసి రాము మీద దుప్పటి కప్పి కొట్టి పారిపోయాడు.

మరునటి రోజు ఒంటరిగా కనిపించినప్పుడు 'గోపీ! నన్ను కొట్టింది నీవేనని తెలుసు. అయినా నిన్ను క్షమించి 'వదిలేస్తున్నాను' అని చెప్పాడు రాము. గోపీ మాత్రం ఆ మాటలు



పట్టించుకోలేదు.

కొన్నాళ్ల తర్వాత స్కూలు మాస్టార్లు విద్యార్థుల్ని ఓ కొండ ప్రాంతానికి పిక్‌నిక్‌కి తీసుకెళ్లారు. అదొక చారిత్రాత్మకమైన ప్రదేశం. కొండపైన శిథిలమైన అనేక రాజగృహాలు వున్నాయి. రాము ఒంటరిగా కనిపిస్తే, మిత్రులతో కలిసి చితకబాదాలనుకున్నాడు గోపి.

ఆ మధ్యాహ్నం వేళ గోపి కొండకింద వున్న చిన్న చెరువుగట్టున దోసిలితో మంచినీళ్లు తాగుతున్నాడు. అదే సమయంలో కొండ మీదనుంచి పెద్ద బండరాయి దొర్లసాగింది. అది చూసిన రాము, వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చి గోపిని పక్కకు లాగాడు. బండరాయి స్పీడుగా వచ్చి, అంతకుముందు గోపి కూర్చున్న చోటుమీదగా చెరువులోకి పడిపోయింది. అది చూసి అందరూ రాము తప్పించకపోతే ఈ రోజు గోపీ చచ్చిపోయేవాడని అన్నారు. తెలివిగా చొరవతీసుకుని కాపాడినందుకు మాస్టార్లు, విద్యార్థులు రామును అభినందించారు.

ఆ సంఘటనతో గోపి మనసు మారింది. కళ్ల నీళ్లు పెట్టుకుని 'రామూ! నన్ను క్షమించు. నిన్ను ఎంతో అవమానించాను. పాపభీతి లేకుండా కొట్టాను. ఈ రోజు కూడా నిన్ను కొట్టాలని చూశాను. ఇవన్నీ మనసులో పెట్టుకోకుండా నన్ను కాపాడావు. నీకు నా కృతజ్ఞతలు' అని చేతులు పట్టుకున్నాడు.

'మన మధ్య వుండాల్సింది క్షమాపణలు, కృతజ్ఞతలు కాదు. స్నేహం. ఇక నుంచి మనం మంచి స్నేహితులుగా వుందాం' అన్నాడు రాము. రాము స్నేహంతో గోపి చెడు అలవాట్లు మానుకుని బాగా చదువుతూ మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ●



క్విజ్-71

1. అంధులకు అచ్చు యంత్రము కనిపెట్టినది?
   ఎ.లూయిస్ బ్రెయిలీ బి. జాన్‌సన్
2. 'లెటర్స్ టు ఇందిర ' రచయిత ఎవరు?
   ఎ.ఇందిరాగాంధీ బి. నెహ్రూ
3. ఎన్ని సంవత్సరములకు ఓటుహక్కు లభిస్తుంది?
   ఎ.18 బి. 19
4. మనదేశంలో అతి చౌకైన రవాణా మార్గము?
   ఎ.జల బి. రోడ్డు
5. ఎడారి ఓడ?
   ఎ. ఏనుగు బి. ఒంటె
6. ఢిల్లీని పాలించిన మొదటి మహిళ?
   ఎ. రజియాబేగం బి. నూర్జహాన్
7. మంటను ఆర్పే వాయువు?
   ఎ.కార్బన్‌డై ఆక్సైడ్ బి.ఆక్సిజన్
8. పెద్దవారిలో ఎన్ని దంతాలు వుంటాయి?
   ఎ.16
   బి.32
9. ప్రపంచంలోకెల్ల పొడవైన నది?
   ఎ. మిస్సోరి మిసిసిపి
   బి. అమెజాన్
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
    ఎ. బిస్మిల్లా ఖాన్
    బి. పండిట్ జస్‌రాజ్



భలే...భలే...బఫూన్!!

ఏంటీ! ఆ చూపు. మరి బఫూన్ అంటే మాటలా. ఒంటి చక్రం సైకిల్‌మీదకూడా మేజిక్‌లు చేయగలడు. మీకు ఎంతో ఇష్టమైన క్రేయాన్లు, రంగు పెన్సిళ్లు తీసుకుని అద్ది చూడండి.

చిన్నారి చిత్రకారులు



కాలువ శ్రీఅనూహ్య,
5వ తరగతి,
అరండల్‌పేట,
గుంటూరు.



కె.శరత్, 1వ తరగతి,
సురభిబాలవిద్యావిహార్, గాంధీనగర్,
హైదరాబాదు.

పి.కృష్ణతేజ,
6వ తరగతి.



కిమిడి సునీల్,
4వ తరగతి,
సరస్వతీ శిశుమందిర్,
సాలూరు.



కొవ్వొత్తి ఆర్పగలరా?

హాయ్! కొవ్వొత్తిని ఆర్పగలరా! 'ఏంటండీ మరీ ఇంత చిన్న చిన్న పనులు కూడా చెయ్యలేమనుకుంటున్నారా ఏంటి?' అంటున్నారా! మీరు నోటితో గాలి ఊది కొవ్వొత్తి ఆర్పుతారు. అవునా. కానీ నేను అడిగేది సీసాతో కొవ్వొత్తి ఆర్పగలరా అని. అదెలాగో నేర్పిస్తాను. రెడీనా. ముందు బొమ్మలో వుందే అలాంటి శుభ్రమైన సీసా తీసుకోండి. దాన్ని మీ బొటనవేలితో మూయండి. ఇప్పడు వేలితో సహా సీసాను మీ నోటిలో పెట్టుకోండి. వేలిని మాత్రమే బయటికి తియ్యండి. మీకు సాధ్యమైనంత గట్టిగా సీసాలోకి గాలిని ఊదండి. తర్వాత సీసా మూతిని మీ బొటనవేలితో మళ్లీ మూయండి. ఇప్పుడు మీరు సీసా మూతిని కొవ్వొత్తి మంటవద్ద వుంచి మీ బొటనవేలిని తీస్తే సీసాలోంచి గుప్పున వెలువడిన గాలి కొవ్వొత్తిని ఆర్పుతుంది. అంతే... చేసి చూడండి. మళ్లీ ఏడు రోజుల తర్వాత మరో కొత్త మేజిక్‌తో మీ ముందుకు వస్తానేం. అందాక టాటా.

మేజిక్! మేజిక్!

క్విజ్ 70 జవాబులు

1. బాలగంగాధర తిలక్ 2. కారల్‌మార్క్స్ 3. రాజపుత్రులు 4. హోంరూల్ 5. వ్యవసాయం 6.ఆఫ్రికా 7. రెబీస్ 8. ఎడ్వర్డ్ జెన్నర్ 9. రెండు 10. సోలీ జె సొరాబ్జీ

క్విజ్ 69కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎమ్. కుమార్, 7వ తరగతి, **ఎమ్. కుసుమ**, 8వ తరగతి, షాద్‌నగర్, మహబూబ్‌నగర్. **కె.వీరన్న**, 10వ తరగతి, **డి.పవన్**,10వ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం. **గాదె మాధవీలత**, 8వతరగతి, బ్రాడీపేట, గుంటూరు. **ఎల్. కామేశ్వరరావు**, గవరపాలెం, విశాఖ. **ఏ.లక్ష్మి**, 9వ తరగతి, పొన్నూరు, గుంటూరు.

కలం స్నేహం

పేరు: మేడా విజయ్‌కుమార్,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, కబడ్డీ ఆడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా :మేడా విజయ్ కుమార్, సన్నాఫ్ మేడా సారంగి, ఫారెస్ట్ ఆఫీస్, పాల్వంచ, ఖమ్మం.

పేరు: ఎ.పరిమళ,
వయసు : 11 సం॥
చదువు : 6 వతరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, టీవీచూడడం.
పూర్తి చిరునామా : ఎ.పరిమళ, డాటరాఫ్ ఎ.దేవానంద్, ఇం.నెం: 3-41, భోగాపురం, రోలుగు గుంట, విశాఖ-531 114.

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలశ్యం ఎందుకు!! ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

మంచి రుతువు!



ఆ రోజు సభ అంతా నిండుగా వుంది. అక్బర్ మహారాజుగారు తమ ఆసనంలో కూర్చుని నిండుగా నవ్వుతూ- 'రుతువులలో ఏ రుతువు మంచిదో చెప్పండి' అన్నారు. అంతా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. కొందరు ఏదో ఒక రుతువు మంచిదని చెప్పారు. కానీ అది ఎందుకు మంచిదో చెప్పలేకపోయారు. అక్బర్‌ను సంతృప్తి పరచలేకపోయారు.

అప్పుడు బీర్బల్ లేచి 'జహాపనా! అన్ని రుతువులూ మనకు మంచి చేసేవే. సంవత్సరంలో ఏ రుతువు రాకపోయినా మనకు వచ్చే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కానీ ఇంకా బాగా ఆలోచించి చూస్తే... ఈ రుతువులలో పేదవాడిని సుఖపెట్టే రుతువు ఒక్కటికూడా లేదు. పేదలు గ్రీష్మ రుతువులో ఎండవలన బాధపడతారు. వర్ష రుతువులో వర్షాలు ఇబ్బంది పెడతాయి. శిశిర రుతువులో చలివల్ల ఎంతో బాధపడతారు. ఇలాగే అన్ని రుతువుల్లోనూ ఇబ్బందులు పడేది పేదవారే. ధనవంతులకు ఏ రుతువు ఎప్పుడొస్తుందో తెలియదు. అన్ని రుతువులూ మంచివే. కాబట్టి వారికి రుతు ప్రభావం వుండదు' అని వివరించాడు. అక్బర్ చక్రవర్తి బీర్బల్ మాటల్లోని నిజాన్ని గ్రహించి అందరికీ ఆ విషయాలు తెలిసినందుకు చాలా సంతోషించారు.

అక్బర్-బీర్బల్ కథలు

వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత

1992వ సంవత్సరం జనవరి 9వ తేదీన భారతదేశంలో జన్మించారు హర్ గోబింద్ ఖొరానా. పంజాబ్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ డిగ్రీ పుచ్చుకున్నారు. 1945లో భారత ప్రభుత్వ స్కాలర్‌షిప్‌పై ఇంగ్లండ్ వెళ్లి అక్కడ పిహెచ్‌డి చేశారు. జెనిటిక్ కోడ్ గురించి, ప్రొటీన్ తయారీలో దాని పాత్ర గురించి అధ్యయనం చేశారు. ఇందుకుగాను ఖొరానా, రాబర్ట్ హోల్లీ, మార్షల్ నీరెన్‌బర్గ్ అనే మరొక ఇద్దరు శాస్త్రవేత్తలతో నోబెల్ బహుమతి అందుకున్నారు.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	ద
	బ్బిలం
	చ్చు
	ద్దించు
	తం
	రిక

గతవారం జవాబులు

ద	రువు
	ప్పడం
	స్తక్
	డి
	గా
	నియాలు

✻ రుక్మిణి

పాపం పుణ్యం పుష్కరమార్గం!

ఆ దినం పూజారి బాబు చాలా ఉల్లాసంగా వున్నాడు. గుళ్ళో అట్టహాసంగా వుంది - జనం చాలా మంది ఎన్నడూ లేంది వచ్చి పూజలు చేసి, హారతులందుకుని, భక్తితో లెంపలు లపలప వాయించుకుని కడు వినయంగా బయట పడుతున్నారు. తాగుబోతు నక్కలోడు, పనీపాటా చేయని గురివిగాడు... చివరికి గోచిపాత గోపయ్య కూడా గుళ్ళోకి ఒంగొంగి పూజలకు తగులుకోడంతో జక్కులోడు నివ్వెరపోసి, నోరెళ్ళబెట్టి గుడి అరుగుల మీద కూలబడ్డాడు

"అన్నా... ఇదేందే... వీళ్ళందరికీ ఒక్కసారే ఈ నడమంత్రపు 'భక్తి' వూడిపడిందే ఎటూ సమజయ్ కావడం లేదు... ఓర్నీ... అయితే ఇక మనవూరు గొప్ప 'భక్తులరాజ్యం'గా మారిపోతుందన్న మాట! అంతేలే... కాస్తంత భయం భక్తి వుంటేనే వూరు ప్రశాంతంగా వుంటుంది కాదె! ఈ కోళ్ళ దొంగతనాలు - ఇంటిగోడలకు కన్నాలు... చెంబూతపేళాలు 'మాయం' కావడం.. ఇకముందుండవు.. ఫర్వాలేదు!"

యాద్గిరి మరో బీడీ వెలిగించి గుప్పుగుప్పున పొగ వదిలి ఆలోచనలో పడ్డాడు. గుడిలో పూజారిబాబు మహాఠీవిగా.. చిన్న హూంకరింపులతో మంత్రాలు చదువుతూ అందరికీ శఠగోపం... నుదుటన విభూతి లాగించేస్తున్నాడు. జనం రద్దీ కూడా పెరిగిపోయింది. అయితే మసలీ ముతకా... పనీపాటల్లేని అలగాజనం... బక్కరైతులు... కూలీలు... అబ్బో! పోను పోను అదో పెద్ద తిరణాల కింద మారిపోయేట్లుంది.

"అరె జక్కులోడా... దీని వెనక మతలబు చాలనె వుందిగానీ... చెప్తానుండు... ఒరే నక్కలోడా" అని యాద్గిరి వాడ్ని పిలిచాడు. వాడు ఎర్రబారిన కండ్లు నులుముకుంటూ వూక్కుంటూ వచ్చిపడ్డాడు.

"అరె.. ఏందిర ఇదంతా.. కూల్నాలి దొరికితే చేసి పదోపరకో సంపాదించి 'పాడుసారా' పీకల్దాకా పీకి.. కాళ్ళు పీకిందాకా చడామడా తిరిగేటోళ్ళు గాదుర మీరు వార్నీ... ఒక్కసారె గింతలావు భక్తి యాడ్నుంచి తగులుకుందిర... తమాషాగుంది!" అని యాద్గిరి గుచ్చిగుచ్చి అడగడంతో వాడు మెలికలు తిరిగిపోయాడు.

"అంతేగాదు. తాగినంక నీ పెండ్లాన్ని వీరబాదుడు బాదితే - అది నోరెత్తడానికి వీల్లేదాయె! అరె... అంటే ఇంక మీరందరూ అచ్చం అపర బ్రహ్మలైపోయినార్ర'' జక్కులోడు మరింత రుసరుసలాడుతూ ఈసడించాడు.

"నిన్నట్నుంచేనాయె!గా గోదారి పుష్కరాల్లో బుడుంగు బుడుంగుమని మునిగినంగద.. అంతే! ఇక ఈపాటికి నేన్జేసిన పాపాలన్ని సాఫై పోయినైగద! అంతే..!"

జక్కులోడికి మూర్ఛ వచ్చినంత పనయింది. కారణం మరేం లేదు - వాడపుడే మరికొంచెం తాగి వున్నాడు గద... వాడు జక్కులోడి అవస్థ చూసి ముసి ముసి నవ్వులు నవ్వాడు.

'అదికాదురా జక్కులోడా... మన బాబు గారు ఒక్కతీర్న టీవీల నిండా... రోజూ పేపర్లనిండా ఆర్నెల్ల నుండే 'పుష్కరాలో... పుష్కరాలో' అని వూదరకు తగులుకునె... పాపం... ఆయన్దే వుంది. పాపాల విమోచనం పొందాలి గదా..

యాద్గిరికి విషయం తేటతెల్లనైంది. ఇదంతా పుష్కరాల దెబ్బన్నమాట! హత్తెరి! "అబ్బో... ఏం జనంరా యాద్గిరి... సముద్రం... చీమల పుట్టలే అనుకో... ఇసకేస్తే రాలదు - కార్లు... బస్సులు... రైళ్ళు... అన్ని రకాల జనం... ఇంకో సంగతేంటంటే ఈ 'బడుంగు'లో మన పాపాల్తో పాటే... మన అన్ని కష్టాలు 'బుడుంగు'మని ఎగిరిపోతాయొరే... ఈ కరంటు బిల్లుల దెబ్బా.. విస జరాలు... దద్దుర్లు... పారుడు... ఒక్క దెబ్బకే మాయం అని మన చంద్రబాబు చెప్పిరి... ఇంగ మనకేం ఇబ్బందులుండవన్నమాట.. మన బాబుగారు గిన ఆ ప్రపంచబ్యాంకు అరవైవేల కోట్ల అప్పులో బుడుంగుమని మునిగి మనకు 'స్వర్ణాంధ్ర' తెచ్చి పెట్టడంలే... గంతే...!" వాడు రెచ్చిపోయి మాట్లాడి పనీపాటా చేయని గురివిగాన్ని వెంటేసుకుని పోవడంతో యాద్గిరి తెప్పరిల్లాడు.

పూజారిబాబు ముసిముసిగా కొంటె నవ్వులు నవ్వుతూ బయటకు వచ్చాడు.

"వాడు చెప్పింది సెంట్ పర్సెంట్ కరక్టు యాద్గిరీ... అందుకే మనం ఇక ముందు నుండి సంవత్సరానికోసారి పుష్కరాల్లో మునగబోతున్నాం.

"ఏంటీ... పన్నెండేండ్లక్కాదా... అరె... సంవత్సరానికోసారా... అదేంది... ఇదేం ఛండాలం!" యాద్గిరి బిత్తరపోయాడు.

"జనాల కదలిక యాద్గిరీ... ప్రతివాడూ ఏదో ఒకపాపం చేయక మానడు గదా... పాపభీతి... బలహీనత... అందుకే నూటడెబ్బయ్యయిదు కోట్లు ఖర్చు పెట్టి 175 పుష్కరాల స్నాన ఘట్టాల్ని పర్మనెంటుగా నిర్మించి పారేసినాడు గదా... ఇదో జన్మభూమి పుష్కరం.. ఏడాదికోసారి... సింపుల్... మన చంద్రబాబుగారు చెప్పనే చెప్పినారు.... ఎవడైతే పుష్కరస్నానం చేయడో వాడికి డైరెక్టుగా నరకానికే టిక్కెట్టు... మరోదారి లేదు... అని బెదరేసినాడు గదా... ఇంకేం జనాలు ఒకడ్ని చూసి ఒకడు తెగబడిపోయారు..

యాద్గిరి బరబర ఆలోచిస్తున్నాడు. నిజమే! ఈ నెల్రోజులు ఎవడూ పెండ్లాం పిల్లలూ... కరంటు... విత్తనాలు నకిలీ పురుగు మందులు.. పట్టిచ్చుకోకుండా 'బుడుంగున' మునుగుడు గురించిన ఆలోచనేనాయె! అబ్బో...!

"మనూరి బడా బడా కంట్రాక్టరు బాస్‌లు... మెంబర్లు.. ఇంచార్జిలు అందరూ తెల్లవారుఝామున్నే వచ్చి ఘనంగా పూజలు ఫినిష్" - పూజారి బాబు చాలా విలాసవంతంగా నవ్వాడు.

"ఇంగ తర్వాత వంతు ఈ అలగా జనాలద న్నమాట... పూజారిబాబూ అసలీ పుష్కరాలకు జన వేందీ... తెగబడిపోతున్నారు." జక్కులోడు అయోమయంగానే అడిగాడు. (పూజారి బాబు మెడను కొంగలా వంచి రహస్యంగా) "ఎగబడిపోడం సరే సగం సంఖ్యను కలిపి మరీ రాస్తున్నారు. పాపుల సంఖ్య స్వర్ణాంధ్రలో చాలా దారుణంగా పెరిగిపోతుంది... ఇంగ మిమ్మల్నెవడూ బాగు చేయలేడనేది మన గవర్నమెంటు పాలసీ...!"

యాద్గిరి నిరుత్తరుడై బీడీ దూరంగా విసిరి పారేశాడు. "అంటే జనాల్నందరినీ కట్టుగట్టి గోదాట్లో నూకి పారేసినారన్నమాట. అది బాగానే వుంది గానీ మరి మీ ఈ గుడికేం వైభోగం పట్టిందీ. ఎన్నడూ లేంది జనం ఇట్లా ఎగబడి పూజలకు పడ్డారేంది గురూ?" జక్కులోడు లాలూచీగా అడిగాడు.

"ఈ జగత్తులో పాపపుణ్యాలు ఎవడి సొత్తూ కాదు. ఈ గోదావరి తల్లీ ఎవడి సొంతం కాదు - ఎవడి కడుపుమంట వానిదీ... పాపం పుణ్యం జాన్తానై! అదుగో ఆ 'స్పెషల్ హుండీ' చూసినారు గదా! అది ప్రత్యేకం మన పర్సనల్ ఎక్స్‌పెరిమెంటు... ఈ సెంటిమెంటును క్యాష్.. డబ్బు... అట్లా పుష్కరాల్లో మునిగి పాపాలన్నీ సుబ్బరంగా కడిగి పారేసుకున్న వాండ్లు ఇట్లా ఈ గుళ్ళోకి ఇమిడియెట్‌గా వచ్చి పూజలు కానిచ్చి... ఆ ఖర్చు పోను మిగిలిన తృణమో ఫణమో ఆ హుండీలో పారేస్తే అది స్వర్గానికి పాసుపోర్టు.. అట్లా అని నేను మన వూర్లో వూదరేసినాను - అంతే! జనం ఇటు ఎగబడ్డారు. అది పూరా నిండిపోయింది-

జక్కులోడు మూర్ఛలోకి జారుకుంటే యాద్గిరి కోపంగా తిట్లను లంకించుకొన్నాడు. ●



కుప్పుడు

ఆ రోజుల్లో రూపాయకు పదారు అణాలు. అణాకు పన్నెండు దమ్మిడీలు. దమ్మిడీకి ఒక ఇడ్లి. అణాకు కొంటే ఒక ఇడ్లీ కొసరు. కొసరు అంటే అధికంగా కొన్న వారికి అదనంగా ఇచ్చేదన్నమాట.

అణాకు కొంటే అందులో ఆరు ఇడ్లీలు నాకు, ఆరు ఇడ్లీలు మా తమ్ముడికి. కొసరు ఇడ్లీలు ఎరుకల ఎంగిటిగాని పాపకు మా అమ్మ ఇచ్చేది.

మొదట నా గురువు చెంగల్‌రాయ పిళ్ళె. ఇంటి దగ్గర గురువు దొరస్వామి. ఉదయం ఆరు గంటలకే బడి. కంఠోపాటం చేయవలసిన ఎక్కాలు, పద్యాలు అప్పుడే చదువుకొని ఇంటికెళ్ళాలి. మరల తొమ్మిదింటికి బడి. ఉదయమంతా తెలుగు పాఠాలు. చరిత్ర, భూగోళం, సైన్సు, ఇప్పటిలాగ పరిసరాల విజ్ఞానం ఉండేవి కావు. సాయంకాలం లెక్కలు మాత్రమే. ఇంగ్లీషు, హిందీ అసలు లేవు. ఇక సెలవులందామా అన్ని పండుగలకు ఉండేవి. ప్రతి అమావాస్యకూ ఆటవిడుపు తప్పనిసరి.

అమావాస్య ఆటవిడుపు తెలివైన వారికి ఆనందాన్ని, చదువు అక్కరలేని వారికి భయాన్ని కలిగించేవి. అమావాస్యకు ముందురోజు పలకల్లో మంచి పద్యాలు రాసిస్తారు గురువు. మరునాడు ఆ పద్యం చూడకుండా రాయాలి. అప్పజెప్పాలి. గురువు చండశాసనుడు. అప్పజెప్పకపోతే ఉగ్రుడు అయిపోతాడు. పెద్ద పద్యం కావలిస్తే అర్ధ అణా, చిన్న పద్యానికి కాలణా గురువుకు కానుకగా ఇవ్వాలి.

అలాంటి వీధి బడిలో మొదట చదివి. తర్వాత అయిదవ తరగతి దాటి ఆరు ఇడ్లీల టిఫిన్ లేకుంటే మజ్జిగ అన్నం అనుపానంగా ఉరగాయో, వేరుశెనగ గింజలో తీసుకొని మూడు మైళ్ళు నడిచి వెళ్ళి ఆరవ తరగతిలో చేరాను. అక్కడేమో చరిత్ర, భూగోళం చెప్పేవారు. ఇంగ్లీషు కూడా నేర్పించేవారు.

ఇంతకూ నేను ఆరో తరగతిలో చేరటానికి ముందు ఇంటి వద్ద పెద్ద ఆటంకం ఏర్పడింది.

"నేను ఒకణ్ణే కదా! ఎద్దులు పట్టుకొని బాన, మోకు ఎత్తుకొని, బండి, దిండ్లు మోసుకొని "దేశమారెమ్మ గుడి బావి'కి వెళ్ళి "కబిలె" కట్టి వరిమడి పారించాలి. ఎడకాలువ గాకుండా మడవలు మార్చాలి. ఇది ఒకడి వల్ల అయ్యే పని కాదు. పెదబ్బను బడికి పంపన"ని కూర్చున్నాడు మా నాన్న. ఆ పెదబ్బను నేనే. మా తమ్ముడు చినబ్బ. మా నాన్న అన్నది నిజం. నా చదువు అంతటితో ఆగిపోయి వారం రోజులు అయ్యింది.

బ్రతుకంతా చిమ్మచీకటిలో తారాడ వలసిన జీవితంలో వెన్నెల విరబూసిన రోజు అది.

తోలుతో (ఎద్దు చర్మం) తయాచేసిన కపిలెబాన చినిగిపోతే కుట్టడానికి వెలివాడ నుండి కుప్పడు వచ్చాడు మా ఇంటికి. అతడు చదువుకోలేదు. బానలు కుట్టి, చెప్పులు కుట్టి బతుకుతాడు. తీరుబాటు ఉంటే కూలిపనికి వెళ్ళి బ్రతుకు బండిని లాగుతున్నాడు. ఇంటి నిండా కీ పిల్లలు, పిల్లలకు గోచీ కూడా కరువే.

"పెదబ్బా! ఇస్కూలుకు పోలేదా?" అన్నాడు అక్కడ బొంగరం తిరగేస్తున్న నన్ను చూచి.

"మా నాయన వద్దన్నాడు" నా జవాబు.

"ఎందుకూ! ఆ ఇస్కూలు దూరమని పోనన్నావా"?

"లేదు".

'మరెందుకు పోలేదు. ఎందుకు వద్దన్నారు.

"దేశమారెమ్మ గుడి" బావి వద్దకు ఎద్దులు పట్టుకెళ్ళాలిట, బండి, దిండ్లు మోయాలట, మడవలు మార్చాలట, మనిషి సాయంకావాలట" కుప్పడు వింటూనే వున్నాడు. బానకుట్టుతూనేవున్నాడు. పేదరికానికి గుర్తుగా దానికెన్ని మాసికలు. కొత్తబాన కుట్టడానికి దబ్బుండేది కాదు. కిర్రు చెప్పుల శబ్దం వినిపించింది. నాన్న వస్తున్నారు. కుప్పడి కంటె నాన్న ఎంతో చిన్నవాడు. నేను అక్కడనే వున్నాను. "గంగిరెడ్డీ! పెద్దబ్బను ఇస్కూలు పంపించు నేను సేద్దెం చేస్తాను" అన్నాడు కుప్పడు స్థిరంగా. 'నిన్ను నమ్మిన దేవుడు గుళ్ళోకి చేరినట్లే. బానలు కుడతావా? కూలీ నాలీ చేస్తావా? నాకు సేద్యంలో సాయం పడతావా ?" నాన్న పంపనట్టున్నాడు బడికి కుప్పడు పంపమంటున్నాడు ఇస్కూలికి.

"నీకెందుకు పగలంతా కూలీనాలీ చేస్తాను. రాత్రుల్లో దేశమారెమ్మగుడి నేలలో వున్న వరిమడికి నీళ్ళు పారిస్తాను" అన్నాడు కుప్పడు.

ఆ మరుసటిరోజే మూడు మైళ్ళు నడచి పెద్దబడిలో చేరాను. పరీక్షలు పాసయ్యాను. తెలుగు పండితుడయ్యాను. ఉద్యోగం చేశాను. ఉద్యోగ విరమణ చేశాను. అక్షరాలు రాని వెలివాడ కుప్పడు ఆనాడు నాకు పెట్టిన అక్షర భిక్ష నా ఈ బ్రతుకు. ఇప్పుడు కుప్పడు లేడు. నేనున్నాను. అతని త్యాగం వుంది. ●

✻ ఎన్. నాగరాజ్

వారాంతపు విహార యాత్రలకు వెళ్ళి చాలా కాలమైన విషయం మాకు అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది. ఎక్కడికెళ్లాలి అనే విషయంపై ఎంతో తర్జనభర్జనలు పడ్డాము. ఈ నడివేసవి కాలంలో బేలూరు వెళ్తే బాగుంటుందని భావించాము. వెంటనే దానికి అవసరమైన ఏర్పాట్లలో పడ్డాము. అనేక మంది మిత్రులు ఈ సమయంలో అక్కడకు వెళ్ళవద్దని మాకు సలహా ఇచ్చారు. అందునా ప్రభుత్వ బస్‌లలో ప్రయాణం మహా కష్టమన్నారు. మైసూర్‌లో బస చేసి చుట్టు పక్కల ప్రదేశాలు చూడవలసిందిగా కొందరు సలహా యిచ్చారు. అయితే మేము బెంగుళూరు వెళ్ళి అక్కడి నుంచి వెళ్లాలని నిర్ణయించుకొన్నాము. ఖాళీ కడుపులతో మేము ఉదయం ఆరు గంటలకు బెంగుళూరులో దిగాము. ప్రభుత్వ రవాణా సదుపాయాలు తమిళనాడులో ఉన్నంత బాగా కర్ణాటకలో లేవని ఎందరో చెప్పారు.



శిల్పాలు అపురూపమే కానీ..

వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అల్పాహారం తింటూ సమయం వృధా చేయరాదని నిర్ణయించుకొన్నాము. అనుకొన్నదే తడవుగా మేము బెంగుళూరులోని ప్రధాన బస్ స్టేషన్‌కు చేరుకొన్నాము. బేలూరు వెళ్ళే బస్ ఎక్కడ దొరుకుతుందని అనేక మందిని అడిగాము. కొందరైతే మేము అడిగేది విన్పించుకోకుండా వెళ్ళిపోయారు. మరి కొందరు అంతర్రాష్ట్ర బస్ స్టేషన్‌ను చూపారు. అక్కడికెళితే తమిళనాడులోని వెల్లూరు వెళ్ళే బస్‌లు ఉన్నాయి. ఇక్కడ మనం నేరుకోవలసింది ఒకటుంది. మనం బేలూరు గురించి అడిగేటప్పుడు దానికి ముందు హాలేబిడ్ లేక హసన్ పేర్లను చేర్చాలి.

ఇక్కడ మాకు ఆశ్చర్యం కల్గించే ఒక విషయుం తెలిసింది. బెంగుళూరు నుంచి బేలూర్‌కు అసలు బస్‌లే లేవు. బేలూరు అనగానే కర్ణాటకలోని ఓ ప్రముఖమైన పర్యాటక కేంద్రమని మనందరికీ తెలుసు. అయితే అక్కడికి వెళ్ళేందుకు బెంగుళూరు నుంచి ఒక్క బస్సూ లేదు. హసన్ వెళ్ళే బస్ గాని లేదా బేలూర్‌లో ఆగే ఏ ఇతర బస్‌గాని ఎక్కవలసిందిగా అక్కడ కొందరు సూచించారు. అయితే బేలూర్‌లో ఆగే బస్ ఎక్కడం మంచిదని మాకు అన్పించింది. కానీ బస్‌ల మీద పేర్లు ఇంగ్లీష్‌లో లేక పోవడం వల్ల బస్ డ్రైవర్‌ను గానీ, కండక్టర్‌ను గానీ అడిగి తెలుసుకోవలసిందే. వారు సరిగానే చెప్పారా అనే విషయాన్ని ధృవీకరించుకోవడానికి బస్‌లోని ప్రయాణీకులను అడిగి తెలుసుకోవడం మంచింది. మమ్ముల్ని బేలూర్‌లో నాలుగున్నర గంటల్లో దింపుతానని డ్రైవర్ చెప్పారు. అయితే 180 కి.మీ. దూరానికి అది చాలా ఎక్కువ సమయం అన్పించింది. వాస్తవానికి ఆ దూరం ప్రయాణించడానికి ఐదు గంటల పైనే పట్టింది. కొత్తగా నిర్మించిన రహదారి చాలా ఆహ్లాదకరంగానే ఉంది. ఉదయం పూట సమయం కావడంతో వాతావరణం కూడా చల్లగానే ఉంది.

మరో గుణపాఠ వేమంటే బెంగుళూరునుంచి బయలు దేరే ముందు ఏవైనా తినుబండారాలు వెంట తెచ్చుకోవడం మంచిది. వీలైతే బెంగుళూరులోనే టిఫిన్ ముగించుకోవడం ఉత్తమం. ఎందుకంటే మార్గ మధ్యంలో ఎలాంటి హోటళ్ళూ లేవు. మార్గ మధ్యంలో చెన్నరాయపట్నం, హసన్ అనేవి రెండు మాత్రమే కొంచెం పెద్ద పట్టణాలు. అయితే అవి మరీ అంత పెద్దవేమీ కాదు. హసన్ నుంచి బేలూరుకు గంట ప్రయాణం ఉంటుంది. అయితే రోడ్డు మాత్రం చాలా చండాలంగా ఉంది. చాలా గతుకులు, గుంటలతో ఉంది. అది ప్రమాదకరంగా కూడా ఉంది. ఒంటి గంట దాటిన తరువాత మేము బేలూరు చేరుకొన్నాము. వెంటనే కర్ణాటక పర్యాటక శాఖవారి ఆధ్వర్యంలో నడిచే మయూరా వేలాపురి హోటల్‌లో దిగాము. ఇక్కడ ఏదైనా మంచి విషయం ఉందంటే అది ఇక్కడి ప్రజలు చాలా స్నేహశీలురు. అయితే హోటల్ మాత్రం చాలా మురికిగా ఉంది. గదులు విశాలంగా ఉన్నప్పటికీ నిర్వహణ ఏమాత్రం బాగుండలేదు.

బేలూరులో చక్కగా గాలి వీస్తోంది. మేము అక్కడ 24 గంటలున్నా వేడిగా ఉన్న భావనే కలగలేదు. మేము మధ్యాహ్న భోజనం ముగించగానే ఆలయాన్ని చూసేందుకు వెళ్లాము. ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు వెంట వెళ్తుంటే అన్ని ఆలయాల్లాగానే అన్పించింది. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే ఇది చెప్పుకున్నంత పెద్ద ఆలయమేమీ కాదనిపించింది. అయితే దగ్గరకు వెళ్లి అక్కడి శిల్పాలను చూసినప్పుడు మనం ముగ్ధులం కాకుండా ఉండలేము. ఆలయంలోని ప్రతి రాయిని అంగుళం అంగుళం అందంగా మలిచారు. ఆలయంలోకి ప్రవేశించగానే కన్పించే గరుడుని శిల్పం నుంచే అక్కడి శిల్పాల అందచందాలను ప్రశంసించడం ప్రారంభిస్తాము. ఆలయ ప్రధాన నిర్మాణం దిగువ వరుసలో ఏనుగులు బారులుతీరి ఉంటాయి. ఆలయం బరువునంతా తమ భుజస్కంధాలపై మోస్తున్నాయా అన్పిస్తుంది. మిగతా శిల్పాలు వివిధ పురాణ గాథలను, దశాలతారాల వంటి వాటిని తెలుపుతూ ఉంటాయి. మరి కొన్ని శిల్పాలు ఆనాటి ప్రజల జీవనశైలిని, ఖాళీ సమయంలో వారు చేసే వేట, సంగీతనృత్యాదుల వంటి వాటిని ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఆలయంలోని శిల్ప సౌందర్యాన్ని మన కనులారా చూస్తేనే మనం నమ్ముతాము. ఆలయం సహజంగా రద్దీగా ఉంటుంది.



పర్యాటకులు సముద్రపుటలల వలే వచ్చిపోతుంటారు. ఒక పర్యాటకుల బృందం ఆలయం నుంచి బయటకు వెళ్ళగానే మరో బస్ పర్యాటకులతో అక్కడ ఆగుతుంది.

మీరు ఇక్కడి ఆలయ అందాలను తనివితీరా చూడాలనుకుంటే ఒక సాయంత్రం, ఉదయం ఇక్కడ ఉండేలా రావాలి. ఆలయ అందాలను ఉషోదయాన చూసితీరాల్సిందే. ఉదయం వేళ స్థానికులు ఎక్కువగా అక్కడకు వస్తుంటారు. పూజారులు ఆలయ బావి నుంచి నీటిని తోడుతున్న శబ్దాలను కూడా వినగలుగుతాము. ●

✻ గమిడి శ్రీనివాస్

ఒక ప్రవాస భారతీయుడు దేశం మీద విపరీతమైన భక్తి(!)ని పెంచుకున్నాడు. ఆ భక్తిని అమ్మకానికి పెట్టి ఐదు కోట్లు ఖరీదు కట్టాడు! ఆ మొత్తాన్ని అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్ చెల్లించగలిగితేనే ఆయన భక్తిని దేశం అందుకోగల్గుతుంది. ఆయన పేరు మనోజ్‌రావు. అమెరికాలో నివాసముంటున్న ఆయనకు సునీతారావు అనే కూతురు ఉంది. ఆమె ప్రస్తుతం అంతర్జాతీయ టెన్నిస్‌లో యువ సంచలనం.

అమ్మకానికి దేశభక్తి

ఖరీదు ఐదు కోట్లు!

పురుషుల విభాగంలో డెవిస్ కప్‌కు సమానంగా పరిగణించే మహిళల టెన్నిస్ టోర్నమెంట్ ఫెడరేషన్ కప్‌లో మాతృదేశమైన భారత్ తరపున ఆడాలని సునీత నిర్ణయించుకుంది. అప్పటి వరకూ ఆమెను స్పాన్సర్ చేసిన అమెరికా టెన్నిస్ అసోసియేషన్‌కు గుడ్‌బై చెప్పనున్నదని ఆ అసోసియేషన్‌కు మనోజ్‌రావు చెప్పారు. భారత్ తరపున ఆడేందుకు అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్(ఏఐటిఏఫ్) సునీతను సాదరంగా ఆహ్వానించింది. కానీ మనోజ్‌రావు తిరకాసు పెట్టాడు.. పదేళ్ల నుండి సునీతను ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణిగా తయారు చేయడానికి తనకు ఐదు కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని ప్రకటించాడు. ఆ మొత్తాన్ని ఏఐటిఏఫ్ తనకు చెల్లించాలని కోరాడు. ఐదు కోట్ల రూపాయలా..! అంత మొత్తాన్ని భరించే స్థితిలో భారత క్రీడా రంగం లేదని ఏఐటిఏఫ్ చేతులెత్తేసింది. ఆటను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఏడాది నిర్వహణా ఖర్చుల కింద లక్ష డాలర్లు(ప్రస్తుత విలువ 42 లక్షల రూపాయలు) చెల్లించాలని కూడా ఆయన అడిగారు. అయితే ఏడాదికి 30 వేల డాలర్ల వరకు భరించగలమని ఏఐటిఏఫ్ తెలిపింది. ఐదు కోట్లు చెల్లిస్తారా లేదా అని ఏఐటిఏఫ్‌కు మనోజ్‌రావు అల్టిమేటం ఇచ్చాడు. ఒకవేళ చెల్లించకుంటే భారత్ తరపున తన కూతురు ఆడబోవడం లేదని అంతర్జాతీయ టెన్నిస్ అసోసియేషన్‌కు తెలియజేస్తానని ఫ్యాక్స్ ద్వారా హెచ్చరికలు పంపాడు.. కన్నదేశం మీద ఆయనకు ఎంత మమకారమో!

సునీతారావు నైపుణ్యం గల క్రీడాకారిణి అనడంలో సందేహం లేదు. అమెరికాలో ప్రపంచ టెన్నిస్ అసోసియేషన్ ర్యాంకులు పొందిన 120 మంది క్రీడాకారిణుల్లో ఆమె 24 ర్యాంకును కల్గి ఉంది. ప్రముఖ క్రీడాకారిణులు సెరీనా విలియమ్స్, వీనస్ విలియమ్స్, డావెన్‌పోర్ట్, కాప్రియాతి సరసన నిలిచింది. ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్ ర్యాకింగ్స్‌లో 162వ ర్యాంకును కల్గి ఉంది. ఈ ఏడాది వింబుల్డన్ జూనియర్స్ సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకుంది. మహిళల క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఫైనల్ రౌండులో పరాజయం పొందింది. మెయిన్ డ్రాలో ప్రవేశానికి కొద్దిలో అవకాశాన్ని కోల్పోయింది. ఇప్పటి వరకు భారత మహిళల్లో నిరుపమా వైద్యనాథన్ అత్యుత్తమంగా 134వ ర్యాంకును పొందగల్గింది. గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్‌లలో ఒక్క ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాత్రమే ఆడగల్గిన ఈమె మొదటి రౌండులోనే ఓడిపోయింది. ప్రస్తుతం ఆడుతున్న మహిళల్లో మనీషా మల్హోత్రా 332, సానియా మీర్జా 419, రుష్మీ చక్రర్తి 429 ర్యాంకులను కల్గి ఉన్నారు. తండ్రి డబ్బు పిచ్చి కారణంగా ప్రస్తుతం సునీతారావు కెరీర్ రెంటికి చెడ్డ రేవడిలా అయింది. భారత్ తరపున ఆడబోతున్నట్లు ప్రకటించగానే ఇస్తున్న స్పాన్సర్‌షిప్‌ను అమెరికా ఆపేసింది. సునీతకు ఇచ్చిన వైల్డ్‌కార్డ్‌లన్నింటినీ రద్దు చేసింది. ఇప్పటి వరకూ అమెరికా తరపున అనేక టోర్నమెంట్లలో ఆమె పాల్గొంది. ప్రస్తుతం ఆమె ఆ అవకాశాన్ని కోల్పోయింది. మరోవైపు దేశభక్తికి ఖరీదు కట్టారనే అపఖ్యాతిని మూటకట్టుకోవాల్సి వచ్చింది. ఆమె తండ్రికి ఏఐటిఏఫ్ అధికారులను కలిసి మాట్లాడే ఓపిక కూడా లేదు. స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడానికి మరో ఏడాది సమయం అవసరమైన 17 ఏళ్ల సునీత తన వ్యక్తిగత వైఖరిని మాత్రం ఇంతవరకూ తెలపలేదు.

ప్రస్తుత భారత క్రీడాకారిణులకన్నా సునీత మెరుగైన ర్యాంకును కల్గి ఉంది. కొద్ది రోజుల్లో 100 ర్యాంకుల్లోపు చేరుకోవచ్చు. ఆమె ప్రాతినిధ్యం ద్వారా ఫెడరేషన్ కప్‌లో, ఒలింపిక్స్‌లో భారత్‌కు మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. కానీ 162వ ర్యాంకును ఐదు కోట్లతో కొనుక్కోవడమా? జీవితమే వ్యాపారం, జీవనమే వ్యాపారం, ప్రపంచమే వ్యాపారం అనుకునేవారికి దేశభక్తిని కూడా అమ్ముకోవాలనుకోవడం తప్పుకాదేమో! భారతీయుణ్ణి నేను... అనే గర్వాన్ని అణువణువునా జీర్ణించుకున్న 100 కోట్ల మంది భారతీయులకు మాత్రం జీర్ణించుకోలేని అంశం. అద్వితీయ అనుభూతయిన దేశభక్తి భావనను గుండెల నిండా నింపుకుని ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్న సైనికుల త్యాగానికి గుర్తింపు ఇవ్వకపోవడమే. ఎన్నో కష్టానష్టాల కోర్చి దేశం కోసం మాత్రమే ఆడి దేశానికి ప్రతిష్ట తెచ్చిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులు రామనాథన్, ఆయన కుమారుడు కృష్ణన్, ఆ తరువాత ప్రకాశ్ అమృత రాజ్ సేవలను తక్కువ చేసి చూపడమే. ◆

* పులుగు శ్రీనివాస్



విలక్షణమైన సాహితీవేత్త 'దాశరథి'

డాక్టర్ దాశరథి రంగాచార్య విలక్షణమైన సాహితీ వ్యక్తిత్వం గల రచయిత. విప్లవ సాహిత్యంలో వచనం గురించి తలుచుకున్నా, సాయుధ పోరాట చిత్రణను స్మరించుకున్నా... తెలుగు సాహిత్య విమర్శలో దాశరథి రంగాచార్యను పేర్కొనని రచన వుండదు. ఆయన స్పష్టమైన నిబద్ధత కలిగిన రచయిత. విప్లవ పోరాటాన్ని చిత్రించే నవలలు రాసిన రచయిత. అదే కలంతో రామాయణ, మహాభారతాలను, చతుర్వేదాల అనువాదాలను ఎలా రచించారన్నది చాలా మంది సాహితీ వేత్తలను కలవరపరిచిన ప్రశ్న. అయినప్పటికీ రంగాచార్య నవలల్లోని నిజాయితీని ఎవరూ శంకించలేరు. అదే సమయంలో పురాణ గ్రంథ రచన పట్ల ఆయన నిబద్ధతను కూడా ఎవరూ సందేహించలేరు. రామాయణాన్ని అనువదించినా ఆయన రామాలయ నిర్మాణం కోసం బాబ్రీమసీదును కూల్చివేయడాన్ని సమర్థించలేదు. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని, గుజరాత్‌లో మతోన్మాదుల దాడులను తీవ్రంగా నిరసించారు. మానవత్వం మంటగలుస్తుంటే ఆవేదన చెందారు. మానవుల శాంతి సహజీవనం కోసం పరితపించారు. ఒక నిజమైన కళాకారుడు తన అనుభూతిని కలిగింది కలిగినట్లుగా వెళ్ళగక్కుతాడు. అలాగే రంగాచార్యను కూడా కదిలించి వేసిన చిత్రణ గాఢత్వం మనల్ని ఆశ్చర్యంలో ముంచేస్తుంది. ఈ రచనా శిల్పంలో భాగంగా వున్న నిస్సంగాత్యమే ఆయన జీవిత వేదాంతానికి పునాదులు వేసి వుండవచ్చు. అందుకే పోరాట నవలల రచనల్లో ఒక శిల్పంగా వున్న ఈ అంశం ఆ తర్వాత ఆయన ఆధ్యాత్మిక రచనల్లో పరాకాష్టకు చేరుకుందేమో అనిపిస్తుంది.

'చిల్లర దేవుళ్ళు' నవలతో పాటు మరో ఎనిమిది నవలలు కేవలం "తెలంగాణా ప్రాంతం" మట్టివాసనతోనే దాశరథి వెలువరించారు. వీటిలో సామాన్య ప్రజల ఉచ్ఛ్వాస నిశ్వాసాలుంటాయి. జీవనగతులూ, శృతులు వుంటాయి. అనుభవాలకు కల్పనలు జోడించి... పచ్చి నిజాలుగా జీవం పోస్తారాయన. తెలంగాణ సాయుధ పోరాటం కేంద్ర బిందువుగా ఎదిగి, వ్యాపించి, సాహిత్య గిరిగీసుకున్న రచయిత ఆయన. చెప్పింది ఒక ప్రాంతపు చరిత్రే అయినా... అందులో విశ్వమానవ జన సంఘర్షణలు, సామాజిక స్థితిగతులు ద్యోతకమవుతూ వుంటాయి.

తెలంగాణాలో ఫ్యూడల్, జాగీర్దారీ వ్యవస్థ ఎంత నిరంకుశంగా వుండేదో, ఆ తర్వాత వచ్చిన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో దాశరథి తన రచనల్లో బట్టబయలు చేశారు. తన నవలల్లో ఏ ఒక్క సిద్ధాంతాన్నీ జొప్పించడానికి ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు. అయితే, అన్ని నవలల్లో అభ్యుదయవాదం, ప్రజాపక్షపాతం, ఆశావాదం కన్పిస్తాయి. అందుకే రంగాచార్య విప్లవోన్ముఖుడై అంతరంగ మథనాన్ని విన్పించారు. తన అనుభవాల్ని నిజాయితీగా అక్షరబద్ధం చేశారు.

"చిల్లర దేవుళ్ళు" నవలకు ముందే తెలంగాణ ప్రజల భాషలో వట్టికోట ఆళ్వారు స్వామి నవలలు వచ్చాయి. గూడూరు సీతారాం, సురమౌళి, భావి నారాయణమూర్తి, వెల్దుర్తి మాణిక్యరావు లాంటి వారి కథలు కూడా వచ్చాయి. అయితే వీరు కావాలని మాండలికాన్ని వాడలేదు. వాళ్ళు మాట్లాడే భాషనే వాడారు. కానీ, "చిల్లరదేవుళ్ళు" అలా కాదు. తెలంగాణాకు మాత్రమే పరిమితమైన కొన్ని ప్రత్యేకమైన సామాజిక స్థితిగతులను తెలియజేయడానికి రాసిన నవల. అందుకే, రచన వ్యవహారిక భాషలో ఉండగా, పాత్రల సంభాషణ మాత్రం... అందమైన, స్వచ్ఛమైన, సొంపైన తెలంగాణ మాండలికంలో వుంటుంది. తెలంగాణ ప్రజలు... వారి భాషను, వారి యాసలో మాట్లాడేందుకు, రాసేందుకు జంకుతున్న ఆ కాలంలో... "చిల్లర దేవుళ్ళు" నవలను వారి భాషలో రాయడం ఒక సాహసమైతే... దాన్ని చదివిన పాఠకులు తమ


కవి అజంతాతో..

ఇంట ర్వ్యూ

ఆధ్యాత్మికవాదంలోకి ఇలా....



✿ **మీ బాల్యం గురించి చెప్పండి ?**

నేను పుట్టిన వరంగల్ జిల్లాలోని 'చిన్నగూడూరు'లో ఐదేళ్ళ వయస్సు వరకే వున్నాను. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల ఖమ్మం జిల్లాలోని 'గార్ల' గ్రామానికి వలస వెళ్ళాం. అక్కడ ఆరవ తరగతి వరకు చదివాను. అప్పటి నైజాం సర్కార్ రూలు ప్రకారం స్కూలుకు చుడీదార్ పైజమా, నల్లటి షేర్వాణీ, రూమీ (కుచ్చు) టోపి తప్పకుండా ధరించి తీరాలనే వారు. నేను 'రూమీ టోపీ'ని తీవ్రంగా వ్యతిరేకించాను. మిగతా విద్యార్థులను కూడా ఈ విషయంలో కూడగట్టాను. దానితో నన్ను స్కూలు నుంచి బహిష్కరించారు. 1940 నుండి చదువుకు స్వస్తి చెప్పి, ఉద్యమాల్లో పాల్గొన్నాను.

✿ **మరి మిగతా చదువంతా ఎలా పూర్తి చేశారు ?**

1951లో ప్రైవేట్‌గా ఆంధ్రా మెట్రిక్ పరీక్ష రాసి పాసయ్యాను. బి.ఏ. పూర్తి చేయాలనే కాంక్ష మేరకు టీచర్ ఉద్యోగంలో చేరాను. అలాగైతేనే అప్పట్లో ప్రైవేట్‌గా బి.ఏ. రాయనిచ్చే వారు. ఆ విధంగా 1956లో బి.ఏ. పాసయ్యాను. అప్పుడే బడిపంతులు ఉద్యోగానికి రాజీనామా చేసి, 1957లో 'మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్'లో ఉద్యోగంలో చేరాను. ఆ తర్వాత మిగతా డిగ్రీలు పూర్తి చేశాను.

✿ **మీరు అంత చిన్నప్పుడే ముస్లిం సంస్కృతిని వ్యతిరేకించడానికి కారణం ఏమిటి ?**

నేను ముస్లిం సంస్కృతికి వ్యతిరేకిని కాదు. వాళ్ళ సంస్కృతిని హిందువుల మీద రుద్దడానికి మాత్రమే వ్యతిరేకిని. అంతేకాకుండా, మా ఇంటి ముందు 'ఆర్యసమాజం' వుండేది. వాళ్ళ నిరంతర బోధనల వల్ల హిందువులకు తురకలు తీరని అన్యాయం చేస్తున్నారనేది నాకు బాగా వంటబట్టింది. దానితో నిజాం నిరంకుశత్వాన్ని అడుగడుగునా ధిక్కరించేవాణ్ణి. అప్పట్లో బహద్దూర్ యార్జంగ్ ఆధ్వర్యంలో అనేక మంది హిందువులను బలవంతంగా ముస్లింలుగా మత మార్పిడి చేశారు. ఆ విధంగా మత మార్పిడిలకు గురైన వేలాది మందిని ఆర్యసమాజం వాళ్ళు తిరిగి హిందువులుగా చేర్చుకునే వారు. దీని తర్వాత 1942లో ఆంధ్ర మహాసభలో చేరి, మావూళ్ళో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాము. అనేక సంస్కరణలను కూడా చేపట్టాము.

✿ **కమ్యూనిస్టు ఉద్యమంలో ఎప్పుడు చేరారు ?**

1947లో మా అన్నయ్య, ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యను నైజాం పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అప్పుడు నేను, మాఅమ్మ, ముగ్గురు చెల్లెళ్ళు బిక్కుబిక్కుమంటూ మిగిలిపోయాం. మా నాన్న మమ్మల్ని వదిలి మరో మహిళతో ఇంకోచోట కాపురం పెట్టాడు. అప్పటికే నేను కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పని చేస్తున్నాను. అదే సమయంలో నన్ను అజ్ఞాతవాసానికి రమ్మని పార్టీ పిలిచింది. దిక్కులేని కుటుంబం, అమ్మ దుఃఖం కూడా నన్ను అప్పుడు ఆపలేకపోయాయి. 1946 నుండి 1949 వరకు అండర్‌గ్రౌండ్‌లో వుండి సాయుధ పోరాటం చేశాను.

✿ **మీ అరెస్టు, లాకప్ బాధల గురించి ఏమైనా చెప్పండి ?**

1948లో నన్ను మా ఇంట్లో రాత్రిపూట అరెస్టు చేశారు. జమేదార్ సర్వర్ వచ్చి నాతోపాటు నా పక్కన వున్న పూసల నారాయణను కూడా 'తుంబీ గద్దార్ హై!'.. అని పట్టుకున్నాడు. పులిహోర తెచ్చిన సూర్యనారాయణను, బెడ్డింగ్ తెచ్చిన అమృతరెడ్డిని కూడా 'బద్మాష్ లోగోం' అంటూ నాతోపాటు అరెస్టు చేశాడు. మమ్మల్ని మోహిత్ మీమ్ సాబ్ కాజిం అలీ వద్దకు తీసుకెళ్ళాడు. 'అబ్బే!... అఖల్‌కే బచ్చే!... ఇన్‌సబ్‌కో క్యోం లాయాబే!' అంటూ అతను సర్వర్‌ను బండబూతులు తిట్టాడు. అలాగే నేను బతికి బయటపడ్డాను. ఒక్కణ్ణే అయితే కాల్చిపారేసేవాడు. అప్పుడు నన్ను 'అరే!.. గాంధీకే బచ్చె... ఇధరా!...' అని కోపంగా పిలిచి దండాతో ఇరగబాదాడు. మమ్మల్ని లాకప్‌లో బంధించారు. తెల్లవారి అఫ్జల్ అనే కానిస్టేబుల్ వచ్చి... 'కిస్మత్ హమారాహై!.. ఆప్ బచ్‌గయే! ఏ మేరా తరఫ్‌సే తోఫాహై!...' అని ఇడ్లీ, పెసరట్టు, టీ, సిగరెట్టు ప్యాకెట్టు టేబుల్ మీద పెట్టాడు. అతని ఆత్మీయతకు నాకు దుఃఖం వచ్చింది. పొగిలి పొగిలి ఏడ్చాను. ఆ తర్వాత మస్తాన్ అనే రజాకార్ సహాయంతో లాకప్ గది నుంచి తప్పించుకున్నాను. పెంట్యాల చలమయ్య సహకారంతో ఎవరూ గుర్తించకుండా అతని భార్యతో కచ్చడం బండిలో పారిపోయాను.

✿ **మీరు భౌతిక వాదంలోంచి ఆధ్యాత్మిక వాదంలోకి ఎలా మారిపోయారు ?**

1957వ సంవత్సరంలో మా ఇంటి ముందు హైదరాబాద్ మాజీ మేయర్ వాసుదేవ మొదలియార్ నివసించే వారు. నేను అదే ఏడాది హైదరాబాద్ మునిసిపాలిటీలో ఉద్యోగంలో చేరాను. ఆయన నన్ను ప్రతిరోజూ ఒక గంట 'పోతన భాగవతం' చదివి వినిపించమని బలవంత పెట్టేవారు. నాకు మొదట్లో ఇది చాలా ఇబ్బందిగా వుండేది. ఎందుకంటే అప్పటివరకు నేను కమ్యూనిస్టు పార్టీలో వుండి భగవంతుణ్ణి దూషించే వాణ్ణి కాబట్టి. కానీ ఏ మహత్యమో ఏమో కానీ నాకు కూడా ఆ భాగవతం బాగా వంటబట్టింది. మొదలియార్‌కు భాగవతంలోని అనుమానాలను సైతం నివృత్తి చేసే స్థాయికి ఎదిగిపోయాను. నేను చదివి విన్పించిన దానికి ఆయన అప్పట్లో ముప్పై రూపాయల దక్షిణ కూడా సమర్పించుకున్నారు.

ఆ విధంగా నేను అనుకోకుండా ఆధ్యాత్మిక వాదంలోకి వెళ్ళిపోయాను. అదే ప్రభావంతో 1960లోనే రామాయణాన్ని అనువదించాను.

✿ **'చిల్లరదేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపథం'లాంటి నవలలు 1960 తర్వాతనే రాసినట్లున్నారు ?**

అవును!... వట్టికోట ఆళ్వారు స్వామిగారు మా మామగారు. ఆయన 'ప్రజల మనిషి' 'గంగు' నవలలు రాశారు. 1961లో ఆయన చనిపోయారు. 'గంగు' నవల మధ్యలోనే ఆగిపోయింది. మా ఇంటికి వచ్చి ఆయన 'గంగు' నవల స్క్రిప్టును చదివి విన్పించేవారు. మా మధ్య చర్చలు జరిగేవి. ఆయన చనిపోయిన తర్వాత 1969 దాకా మళ్ళీ తెలంగాణ మీద సాహిత్యం రాలేదు. అందుకే, నేను దాన్ని పూరించడానికి 1969లో 'చిల్లరదేవుళ్ళు' విడుదల చేశాను. ఆ తర్వాత మిగతావి వరుసగా రాశాను.



కవి కాళోజీతో..

ఆత్మన్యూనతను పోగొట్టుకోవడం మరో గొప్ప విజయంగా చెప్పుకోవచ్చు.

డా॥ దాశరథి రంగాచార్య నవలలు అన్నింటిలోకి "చిల్లర దేవుళ్ళు" నవలకు మంచి పేరు, గుర్తింపు వచ్చింది. ఈ నవల హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదం కూడా అయింది. నాటకంగా రేడియోలో ప్రసారం అయింది. ఇదే పేరుతో సినిమాగా వచ్చింది.. "ఈ దొరతనమే ఇంత!... సాగినన్నాళ్ళు సాగుతుంది!... మంది తిరగబడితే మనగతేమయితది?..." అనే ఒక డైలాగ్ దొరసాని పాత్రను పోషించిన మహానటి సావిత్రి నోట మహాద్భుతంగా పలికింది. అందుకు కారణం...ఆ డైలాగ్‌లో వున్న "సార్వజనీన సత్యం"ను రచయిత అంతబలంగా విప్పి చెప్పడమే. ఆ మాట రామారెడ్డి దొరకో, నిజాం ప్రభువుకో పరిమితం కాదని, దొరతనమంటే ప్రభుత్వమని, ప్రజలు తిరగబడితే ప్రపంచంలో ఏ ప్రభుత్వమైనా ఇంతేనని దాని సారాంశం. ●

గణితంలో గందరగోళం



వేదగణితం
(మౌఖిక గుణకార, భాగహార పద్ధతులు)
రచన : డా॥ తోటకూర సత్యనారాయణ
వెల : రు. 25/-.
ముద్రణ మరియు ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

సాధారణంగా విద్యార్థులకు లెక్కలంటే భయం. ప్రాథమిక స్థాయిలోనే సరైన లెక్కల టీచర్ దొరకకపోతే ఆ విద్యార్థికి గణితమంటేనే భయం, అనాసక్తి పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా గుణకార, భాగహారాలు చేయాలంటే ఎక్కాలు రావటం తప్పనిసరి. చిన్నప్పుడే ఎక్కాలను బట్టీ పట్టించడం మన వారికి అలవాటు. ఎక్కాలు నేర్చుకోవడానికి బద్ధకిస్తే గుణకార, భాగహారాలు చేయలేరు. పెద్ద క్లాసులలోకి వెళితే వర్గములు, ఘనాలు లాంటి లెక్కలను కూడా చేయలేరు. లెక్కలను బట్టీ పట్టి కంఠస్థం చేయడం కష్టమైతే, అతి సులువైన పద్ధతి "వేద గణితపు ఎక్కాలు" అంటూ రచయిత బీజగణిత సూత్రం ద్వారా ఎక్కాలను లెక్కపెట్టుకోవచ్చు అని తెలిపిన పద్ధతి ఇంకా క్లిష్టమైనదే. దీనికంటే ఎక్కాలను బట్టీ పట్టడమే సులువు. ఇదేకాదు ఇందులో తెలియజేసిన మౌఖిక గుణకార, భాగహార పద్ధతులు కూడా అభ్యాసం లేకుండా అంత సులువుగా వంటబట్టవు. ముక్కు చూపించమంటే చుట్టూ తిరిగి చూపించడం ఎలా వుంటుందో, ఈ పుస్తకం ద్వారా లెక్కలు నేర్చుకోవడం అలా వుంది. సంప్రదాయ పద్ధతుల కంటే ఈ వేద గణిత పద్ధతి క్లిష్టంగా ఉండటమే కాకుండా ఎక్కువ సమయం తీసుకుంటుంది. నిజానికి ఇది విద్యార్థుల కంటే ఉన్నత స్థాయి విద్యార్థులకు, గణితంపై ఆసక్తి గల పెద్దలకు మాత్రమే ఉపయోగపడుతుంది. అది కూడా ఓపిక, తీరిక వున్న వాళ్ళకి మాత్రమే.

- కె.పి.అశోక్ కుమార్

స్వ అనుభూతుల అల్లిక ఈ కథామాలిక

అందమైన తీగకు కథామాలిక
రచన: కొత్తపల్లి ఉదయబాబు
వెల : రు. 50/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

కొస్త ఆనందం, మరికాస్త ఉత్కంఠత, ఇంకాస్త అద్భుతం. అనుభూతుల్ని గుప్పెట పట్టి తన కథల్నిండా చిలకరించాడు కొత్తపల్లి ఉదయబాబు. తన అందమైన తీగకు (కథా సంపుటి)లోని అన్ని కథలూ బాగున్నాయని చెప్పడానికి సాహసించకపోయినా కొన్ని కథలు అద్భుతంగా ఉన్నాయని చెప్పొచ్చు. ఈ కథల్లోని వస్తువు తన చుట్టూ ఉన్న పరిసరాల్లోనిదే పోగేసుకున్నాడు రచయిత. అందుకేనేమో ఏ కథ చదువుతున్నా బామ్మో, తాతో, అదీకాకపోతే బాగా పరిచయమైన ఓ మిత్రుడో చెప్పినట్లుంటుంది. కథలో ఉత్కంఠం, నాటకీయ సంభాషణలు బాగానే రంగరించాడు ఉదయబాబు.

ఏ కథకాకథ విడివడి ధ్వనికదే ప్రత్యేకతల్ని నింపుకున్నాయి. 'గోదారి' కథలోని వస్తువు తెలిసిందే. కానీ నడిపించిన తీరు ఉదయ బాబులోని సాహితీ పరిశీలన దేన్ని పెట్టుకున్నా బంగారం చేయగలదన్న నమ్మకం కలిగిస్తుంది. చిన్ననాడు చదువుకున్న కాకి దాహం తీర్చుకున్న కథను మర్చిపోలేకపోయాడు. దానిలోని అంతఃసూత్రాన్ని మరోకొత్త రూపంగా చూపించాడీ కథలో. 'మేలి ముసుగు' కథలో ఓ స్త్రీ తన భర్తను అనుమానిస్తే జరిగే నష్టాన్ని ముందుగానే ఊహించి ఆమె స్నేహితురాలు ఆమె భర్తలోని మంచిని చూపించిన తీరు చాలా బాగుంది. కొన్ని కథలు సంక్షిప్తంగానైనా చెప్తే ఇక పాఠకుల్లో ఉత్కంఠత తగ్గుతుందన్నట్లున్నాయి.

'కడిగిన ముత్యం', 'అందమైన తీగకు' 'ముద్దబంతి నవ్వులో' తదితర కథల్లో కాస్త మసాలా కలిపి పాఠకుణ్ణి కైపెక్కిస్తాడు రచయిత. అయితే ఈ కథల్లో కన్పించే వస్తువులుగానీ, వర్ణనలు గానీ కొత్తవేంగావు. అయినప్పటికీ చదవగల్గించేంతగా ఉండటం పాఠకుల్లోని వాసనా రూపంలోని నవరసాలే.

ఏకలవ్యుడు కథ చదివిన తరువాత శ్రీశ్రీ ఓ సందర్భంలో (నాటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలు కావచ్చు) అన్నమాటలు గుర్తొస్తాయి. ఈ కథ ఒకే ఒక్క పేజీలో నిండి ఉంది. కాస్త కరుణ రసం, ఇంకాస్త అద్భుతం, భయం రసాలు అన్నీ కలబోసుకొని కొత్తదేదో 'రసనం' పుడుతుంది పాఠకునిలో. కొన్ని కథల్లో కావాలని నింపిన శృంగార రసాన్ని ఈ కథలోని 'రసనం' డామినేట్ చేస్తుంది. ఏదేమైనా పుస్తకం మీద అట్ట (వెనకభాగం) చిత్రణ, కొన్ని పేజీల్లో డబుల్ ముద్రణ వెరసి అసహనం తప్ప మిగతావన్నీ రచయితలోని ప్రతిభకు నిదర్శనంగా ఉన్నాయి. ఇంకాస్త సమాజపు అసంతృప్తుల్ని కోట్ చేస్తే బాగుండేది. మేఘాల్లో ఎంతకాలమని సంచరిస్తాడీ రచయిత అన్పిస్తుంది. రాబోయే కథల్లో ఈ అసంతృప్తిని పోగొట్టగలడనే నమ్మకంతో ఆ దిశలోని కథల కోసం వేచి చూడాలి.

- సైదులు ఐనాల

స్వీకారం



భాగమతి కులీకుతుబ్ షా
ప్రణయ గాథ చారిత్రాత్మక పద్యకావ్యం
రచయిత : మల్లవరపు వెంకటరావు
వెల : రు. 50/-; **ప్రతులకు** : మల్లవరపు రాజేంద్ర ప్రసాద్, ఎం.టెక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆఫీస్ ఆఫ్ ది ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఆర్ అండ్ బి) ఎర్రమంజిల్ హైదరాబాద్



జీవించే హక్కును తృణీకరించి - బానిస ప్రవృత్తిని బలపరిచే కాంట్రాక్టీకరణ
రచన: మండగడ్డ విక్రమ్‌కుమార్
వెల : రు. 3/-; ప్రచురణ : సహచర పబ్లికేషన్స్ "భగత్‌సింగ్ భవన్", ఇ.నెం. 3-128, చందానగర్, హైదరాబాద్ - 500 050



స్వభాను కిరణాలు
వచన, గేయ, పద్య కవితల సంకలనం
వెల : రు. 50/-;
సాహితీ వేదిక (రి.నెం.621/2000) అనకాపల్లి
ప్రతులకు : పిళ్ళానూకరాజు (పినాకిని) శ్రీదేవి బిల్డింగ్, చినరామస్వామి కోవెల వీధి, గవరపాలెం, అనకాపల్లి - 531 002

కలలెందుకు వస్తాయని అడిగితే ఏం చెబుతాం? వస్తాయి? అందరికీ వస్తాయి. రాజూ పేదా అనే తేడాల్లేకుండా ఆడా మగా అందరికీ వస్తుంటాయి. రాత్రిళ్ళు ఆదమరచి నిద్ర పోతున్నప్పుడే కలలు వచ్చును అని సూత్రీకరించడానికి వీల్లేదు. కొన్ని కలలు నిద్రపోకుండానే వస్తుంటాయి! వీటిని పగటి కలలు అంటారు. ఈ జాతి కలల యొక్క పగ్గాలు - కలకనే ఆసామి చేతుల్లోనే ఉంటాయి. అంచేత అతను ఎటు తిప్పితే అటు తిరుగుతుంది పగటికల! 'బ్లాకండ్ వైట్ లో బాగుండదనుకుంటే - టెక్నికలర్ కల కూడా కనవచ్చు.' ఆ ఏర్పాటు కల కనే మనిషే చేసుకుంటాడు!

అనగనగా కల..

అందమైన ఉద్యానవనం. మలయమారుతం. నీళ్ళు చిమ్మే ఏర్పాట్లు. అప్సరసలు. వాళ్ళు అందించే రకరకాల పానీయాలు. వాళ్ళ నృత్య విన్యాసాలు. ఇళయరాజా మ్యూజిక్కు. ఒకటేమిటి? ఎన్ని ఏర్పాట్లతో ఏం కావాలనుకుంటే - ఆ దృశ్యం మొత్తం మన కళ్ళ ముందు - పైసా ఖర్చులేకుండా - వెలుస్తుంది. మనల్ని ఎవ్వరూ డిస్టర్బ్ చేయకపోతే కోటీశ్వరుడి లెవెల్లో ఆ కాసేపూ వెలిగిపోతాం. మనసు చెడిపోయినప్పుడు పగటి కల ఒకటి ఏర్పాటు చేసుకుంటే మెదడుకు మంచిదంటారు కళాప్రియులు! అదెంత వరకు నిజమో ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవాలే తప్ప - శాస్త్రం చదివేసి అవును సుమా అనుకోడం అంత మంచి పద్ధతి కాదు!

పగటి కలలకు కలవరింతలుండవు. ఎంతకీ స్వయం పాకమే! ఆ థ్రిల్లేవిటో ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవాలేగాని - అనుభవిస్తున్న థ్రిల్లును రన్నింగు కామెంట్రీ టైపులో చెప్పుకు పోవడం అనుకున్నంత సులువు కాదు.

ఆదమరిచి నిద్రపోయేది రాత్రిళ్ళే! అప్పుడొచ్చే కలల మీద మనకి కమేండు ఉండదు. ఏదో దిక్కుమాలిన సీను నడుస్తుంది. దానికి తగ్గ డైలాగులు కలవరింత రూపంలో ఆటోమేటిగ్గా నోటి నుంచి పుట్టుకొచ్చేస్తాయి. కలకంటూ కలవరించే శాల్తీ సంగతేమోగాని - ఆ తంతు పరిశీలించే మనిషికి మాత్రం పిచ్చెక్కిపోతుంది. కలవరింతలకు వ్యాకరణం ఉండదు. కర్తా కర్మ క్రియలు వాటి ఇష్టమొచ్చిన బాణీలో వెలువడుతుంటాయి!

కలవరింత వినాలని ముచ్చట పడొచ్చు! కలవరించే మనిషికేమోగాని - ఆ కలవరింత వినే మనిషికి దృశ్యం కనిపించదు. కొన్ని శబ్దాలు వినిపిస్తాయి. వాటికి తలాతోకా ఉండదు. శబ్దాన్ని బట్టి కలలో కనిపించే దృశ్యాన్ని ఊహించడం సాధ్యం కాదు. నన్ను చంపకని కలవరిస్తే - వారిని ఎవరు చంపే ప్రయత్నం చేస్తున్నారో - తెలుసుకోడం కష్టం! ఎందుకంత ముదనష్టం ప్రోగ్రాం పెట్టుకున్నారో అర్థం కాదు! మొత్తానికి సదరు కలలో ఏదో రగడ జరుగుతోందని మాత్రం ఊహించవచ్చు. ఏతావాతా కల తాలూకు కథ యొక్క పూర్తి పాఠం తెలుసుకోడం బహుకష్టం!

మగమహారాజులుపయోగించే చిట్కాల్లో కలవరింతకు ప్రముఖమైన స్థానముంది! అవసరమనుకుంటే కలరాకుండానే వచ్చినట్టు నటిస్తారు. పక్కన పడుకున్న అర్ధాంగి సుబ్బరంగా వినేలాగా కలవరిస్తారు! ఈ జాతి కలవరింత మచ్చుకి ఒకటి వివరిస్తాను. సీతా నిన్ను కొట్టేను. చితక బాదేను. మహాపాపిని. ఉత్తమ ఇల్లాలివి నువ్వు. దేవతలాటి నిన్ను పచ్చడి చేసిన పాపానికి కళ్ళనీళ్ళు పెట్టుకున్నావేగాని - నన్ను శపించలేదు! క్షమించు సీతా అంటో రిహార్సిల్సు వేసుకుని మరీ కలవరిస్తాడు. ఆ దెబ్బతో సీతమ్మ దెబ్బల బాధ మరిచిపోతుంది! అదంతా అతని తాలూకు పశ్చాత్తాపమనుకుంటుంది. జన్మ జన్మలకు అతన్నే భర్తగా ప్రసాదించమని దేవుణ్ని వేడుకుంటుంది!

మళ్లీ ఎప్పుడైనా ఆమెను అతడు కొడితే - అతని కలవరింతల కోసం వెయిట్ చేస్తుందేగాని కన్నీరు పెట్టుకోదు! కొట్టడం తిట్టడమే కాదు. మావగారు స్కూటరు కొనివ్వకపోయినా - భార్యామణి వినేలాగా కలవరిస్తాడు. మాంగారూ - మా ఫ్రండ్సుకి మీ మంచితనం నిరూపించాలని స్కూటరు కొనమన్నానే గాని, నా కోసం కానే కాదు మాంగారూ! కానేకాదు అంటూ గేపులిచ్చి కలవరిస్తాడు. ఆ కలవరింతలకు సీతమ్మ కదిలిపోతుంది. అల్లుడి గారికి స్కూటరు కొనివ్వకపోతే కిరసనాయిలే నాకు దిక్కని తండ్రికి ఉత్తరం రాస్తుంది. ఉత్తరం చేరగానే స్కూటరుకు ఆర్డరిస్తాడు ఆ పిచ్చి తండ్రి! కలిసొస్తుందంటే కలవరించేందుకు వెనకాడని మనిషి అతను. కలవరింత అనగా అంతరాత్మ తాలూకు భాషని ఆరాటపడే మనిషి ఆమె! ఈ కథకు ముగింపులేదు గాక లేదు! ●

రియల్ స్టోరీ

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

చుట్టూ పచ్చని పరిసరాలు... పంట పొలాలు... ఆ మధ్య నుంచి సన్నని కాలిబాట... పాతిక ముప్పయి గడపలతో చిన్న పల్లె... తమిళనాడు రాష్ట్రంలో మదురై సమీపంలో పుల్లుచెరి ఆ గ్రామం పేరు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పోస్ట్‌మేన్ పొన్నుస్వామి మొదటిసారిగా ఉత్తరాన్ని తీసుకుని ఆ గ్రామానికి బయలుదేరాడు.

మదురై నుంచి ఏ పోస్ట్‌మేనూ ఎప్పుడూ ఆ గ్రామానికి వెళ్ళలేదు. ఏడాదికి ఒకటో రెండో ఉత్తరాలు వస్తుంటాయి. ఆ గ్రామానికి చెందిన వారు ఎవరైనా కనిపిస్తే వారి చేత ఉత్తరాలు పంపిస్తుంటారు.

స్త్రీ శక్తి - చిన్నపిళ్లై

పొన్నుస్వామి కొత్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పుల్లిచెరి గ్రామానికి వచ్చిన మొదటి ఉత్తరం... ఎవరిచేతికైనా ఇచ్చి పంపించాలని అనుకున్నాడు. అయితే అది భారత ప్రభుత్వ అధికారిక ముద్రతో వచ్చిన ఉత్తరం. అందిన వ్యక్తి ఎకనాలెడ్జిమెంటు కూడా పంపాలి. అందుకే పొన్నుస్వామి ఎండలో పాత సైకిలు మీద బయలుదేరాడు.

పుల్లిచెరి గ్రామం చూసి ఆశ్చర్యపోయాడు.

ఉత్తరం మీద అడ్రసు మరోసారి చూసుకుని నిర్ధారించుకున్నాడు... పక్కనున్న వ్యక్తిని పిలిచి "చిన్నపిళ్ళై ఇల్లు ఎక్కడ?" అడిగాడు.

ఆ వ్యక్తి దూరంగా ఉన్న పూరిపాకను చూపించాడు. పొన్నుస్వామి తన సైకిలును, ఉత్తరాల కట్టను వదిలి పెట్టి ఆమె ఇంటికి వెళ్ళాడు.

చిన్నపిళ్ళై ఇంటిలో నుంచి బయటికి వచ్చింది.

అరవై ఏళ్ళ వయసు.. ముగ్గుబుట్ట లాంటి తల.. రంగు వెలసిపోయిన చీరతో ఒకామె బైటికి వచ్చి – "ఎవరు ?.. ఏమి కావాలి?" అంది

"నీకు ఉత్తరం వచ్చింది?"

"నాకా?" చిన్న పిళ్ళైలో ఆశ్చర్యం.

"అవునమ్మా! నీకే. చిన్నపిళ్ళై అంటే నువ్వే కదా? ఇదిగో ఇక్కడ సంతకం పెట్టు!" అంటూ బరువైన కవరు ఆమె చేతిలో పెట్టాడు.

"ఎక్కడి నుంచి? ఏమిటిది?'' ఆశ్చర్యం..

"కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చింది"

నువ్వే చదివి పెట్టుబాబూ! నీకు పుణ్యం ఉంటుంది!" ప్రాధేయపడింది.

పొన్నుస్వామికి కూడా ఆశ్చర్యంగా వుంది. మారుమూల గ్రామంలో ముసలమ్మకు ప్రభుత్వం నుంచి ఏమి వచ్చిందా అని. వెంటనే కవరును చింపి అందులో కాగితాలను తీశాడు.

విషయం అంతా చదివి "అమ్మా! భారత ప్రభుత్వం నిన్ను గుర్తించింది. స్త్రీ శక్తి అవార్డు నీకు లభించింది. ఢిల్లీ రమ్మని పిలిచింది!" ఉద్వేగంతో చెప్పాడు.

ఆ మాటలు చిన్నపిళ్ళైలో ఆనందాన్ని కలిగించాయి.

అంతవరకూ సామాన్యంగా కనిపించిన చిన్నపిళ్లైలో అద్భుత స్త్రీ మూర్తి దర్శనమిచ్చింది. రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు పొన్నుస్వామి.

***

చిన్నపిళ్లై జీవితమంతా ఒడిదుడుకులతోనే సాగింది. చిన్నతనంలోనే తల్లిని, తోబుట్టువుల్ని కోల్పోయింది. వివాహం చేయలేని స్థితిలో పద్దెనిమిదవ ఏట పెరుమాళ్‌తో వివాహం అయింది. అప్పటికే అతనికి రెండు పెళ్ళిళ్ళు అయ్యాయి.

భర్తకు వ్యవసాయంలో సాయం చేస్తూ ఇంటిపని, వంటపనులన్నీ తానే చేసేది. భర్త అనారోగ్యం పాలవడంతో ఈమె మొత్తం కుటుంబ బాధ్యత నెత్తిన ఎత్తుకొంది.

పదిమందికి ఉపయోగపడాలని, ఏదో ప్రత్యేకత చూపించాలని చిన్నపిళ్లై అనుకొనేది. ఆ ఆశయంతోనే తాను పని చేసే ప్రాంతంలో కూలీలందర్నీ కూడగట్టి సంఘంగా ఏర్పాటు చేసి దానికి నాయకురాలైంది. యజమానులతో పోరాటం చేసి కూలిరేటును పెంచేలా కృషి చేసింది. గ్రామంలో మహిళలందర్నీ సంఘటిత పరిచి పొదుపు సంఘం ఏర్పాటు చేసింది. పదిమంది మహిళలు తలో ఇరవై రూపాయలు చొప్పున పొదుపు ప్రారంభించారు.

వీరి ఉత్సాహం చూసి మదురై సమీపంలో వున్న వైగై ఫెడరేషన్ ప్రోత్సహించింది. గ్రామీణ మహిళల్లో పొదుపు ఉద్యమం పెంపొందించడానికి చిన్నపిళ్లైను ఎంపిక చేశారు. సమీప గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి ఎంతో కృషి చేసింది. పాడి పరిశ్రమ, కళాత్మక వస్తువుల తయారీ, బట్టలు కుట్టడం వంటి స్వయం ఉపాధి పథకాల్లో



మహిళలకు భాగస్వామ్యం కల్పించింది. ఈ గ్రూపుల మహిళలకు సహకార బాంకులు, వ్యవసాయాభివృద్ధి బాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. టాటా సంస్థకు చెందిన ట్రస్టు 24 లక్షల రూపాయల విరాళాలు ప్రకటించింది.

ఈ కృషి చేసినందుకుగానూ చిన్నపిళ్లెను ప్రభుత్వం గుర్తించింది. స్త్రీ శక్తి పురస్కారం దేశంలో అయిదుగురికి ఇవ్వగా అందులో పిళ్లె ఒకరుగా ఉంది. 2000 సంవత్సరంలో ప్రధానమంత్రి వాజ్‌పేయి ఈ అవార్డు అందజేశారు. ఇటువంటి స్త్రీమూర్తి ప్రతి గ్రామంలోనూ ఒకరైనా ఉండాలని ఆకాంక్షించారు.

***

పుల్లుచేరి గ్రామం.

చిన్నపిళ్లె నివాసం విషాదంలో మునిగి ఉంది. ఆమె భర్త పెరుమాళ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఏకైక కుమార్తె వేలంగిణి హఠాత్తుగా ప్రమాదంలో చనిపోయింది.

అప్పటి నుంచీ ఆమెలో విషాదం కమ్ముకొంది. ఒకప్పుడు ఎంతో ఉత్సాహంగా పని చేసిన ఆమెకు ఏ పనిమీదా శ్రద్ధ ఉండటం లేదు.

రోజూ ఎంతోమంది వస్తున్నారు. ఊరడిస్తున్నారు. మళ్లీ మునుపటి చిన్నపిళ్లెగా తయారవ్వమని అభ్యర్థిస్తున్నారు.

అందరి మాటల్నీ వింటూ ఆమె శూన్యంలోకి చూస్తూ ఉండిపోతోంది.

పొన్నుస్వామికి మళ్ళీ ఆ ఊరు వచ్చే పని పడింది. గ్రామంలోకి రాగానే చిన్నపిళ్లె ఇంటికి వచ్చి "అమ్మా" అంటూ పిలిచాడు.

చిన్నపిళ్లె బైటికి వచ్చింది.

ఆమెలో విషాదం గ్రామస్తుల ద్వారా పొన్నుస్వామి విని ఉన్నాడు. "అమ్మా! నీకు చెప్పేటంత పెద్దవాడిని కాదు.. మన కుటుంబం మనకి పరిమితం. కానీ ఈ గ్రామం... ఈ మనుషులు.... ఈ ప్రపంచం అందరిదీ... నువ్వు అందరికీ చెందిన దానివి. నీ విషాదం అందరికీ విషాదం కాకూడదు. నువ్వు మళ్లీ చిన్నపిళ్లెవి కావాలి. ప్రధానమంత్రి నిన్ను మాతృమూర్తిగా గుర్తించారు.... మేమూ అంతే!" చెప్పలేక చెప్పాడు.

చిన్నపిళ్లె నవ్వలేక నవ్వింది.

అప్పుడు పొన్నుస్వామి మరో ఉత్తరం అందిస్తూ - "ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో 70 వేల సభ్యులు కలిగిన 35 పొదుపు ఫెడరేషన్ల కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. దానికి నిన్ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నీ ఆనందం కోసం ఈ ఉత్తరం పంపారు. నువ్వు కాదనవన్ని నమ్ముతున్నాను!" అన్నాడు.

చిన్నపిళ్లె ఆ ఉత్తరాన్ని అందుకుంది.. "నా మీద ఎంతో నమ్మకం ఉన్నవారిని కాదనలేను... నన్ను మనిషిని చేశావు!" అంది.

పొన్నుస్వామి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "దేశం అంతా మెచ్చిన అమ్మవి నువ్వు... నీ మెచ్చుకోలు నా జీవితాన్ని ధన్యం చేసింది!" అంటూ వెనుతిరిగాడు. "అమ్మా! మళ్ళీ వస్తాను... మరో మంచి ఉత్తరంతో" అంటూ సైకిలు ఎక్కివెళ్ళిపోయాడు.

సరిగా ఆరు నెలల తర్వాత మళ్ళీ వచ్చాడు.

పొన్నుస్వామి చేతిలో మరో ఉత్తరం

"అక్షరజ్ఞానం లేని అసాధారణ మహిళ చిన్నపిళ్లెకు జానకీదేవి బజాజ్ అవార్డు-2000 అందిస్తున్నాం!" అనే సమాచారం ఆ ఉత్తరంలో ఉంది.

ఉత్తరాన్ని అందించి ఆ అవార్డు తనకే లభించినంత ఆనందాన్ని పొందాడు పొన్నుస్వామి. ●

చారిత్రక..

"ఒకే తరహా నేరంపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తులు వారిని రిమాండుకు పంపారు. ఆర్థిక పరిస్థితి, వెనుకబాటు కారణంగా వీరికి బెయిలు కూడా లభించలేదు. ఎప్పటిలాగానే వాయిదాల మీద వాయిదాలు పడుతూ వారి రిమాండు పదేపదే పొడిగించబడింది".

ఇలా ఏడాది కాలం రిమాండులోనే ఖైదీలుగా ఉన్నారు. ఏడాది అనంతరం న్యాయమూర్తులు ఒక్కొక్కరికి సంవత్సరం చొప్పున శిక్ష విధించారు. అయితే అప్పటికే రిమాండు ఖైదీగా ఏడాది పూర్తిచేసినందున ఒకరిని వెంటనే విడుదల చేశారు. మరొకరిని మాత్రం విడుదల చేయలేదు. కారణం మరొకరు 'గిరిజనుడు' కావడమే. కాలం చెల్లిన 1898 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఇంకా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలు జరుగుతుండటమే ఇందుకు కారణం. దీనికి సవరణలతో రూపొందించిన 1973 సిపిఆర్‌సి అమలు జరక్కే గిరిజనులకు అన్యాయం చేకూరుతోంది.

వంటి కింద రాయిపడితే తినడం ఆపేసినట్లుగా చదువుతున్న వ్యాసాన్ని ఆపేశాడు సుబ్రహ్మణ్యం.

అరే .... ఇంత మంచి విషయం మీద చక్కని లీడ్‌లో మొదలు పెట్టిన ఈ వ్యాసంలో కూడా 'ఇలాంటి' పదాలు రావడమేమిటి? అని అతగాడు బాధపడిపోయాడు.

మంచి విషయాలను చెప్పగలిగిన రచయితలు తగిన పదాలను రాయలేకపోవడమేమిటి? అని తర్కించుకున్నాడు. పొరపాటా? నిర్లక్ష్యమా?

వ్యాసంలో అతగాడికి పట్టేసిన పదం 'అన్యాయం చేకూరుతోంది' అనే ప్రయోగం. అన్యాయం అవాంఛనీయం. చేకూరడమనేది వాంఛనీయతకు వాడే క్రియాపదం. ఈ రెంటికీ ఎలా లంకె పెడతారు? రెంటినీ కలిపి రాయడమంటే పాఠకులకు అన్యాయం 'చేకూరడమేగా' అని వ్యంగ్యంగా ప్రశ్నించాడు సుబ్రహ్మణ్యం తన పాత్రికేయ మిత్రుడు కైలాసాన్ని.

కైలాసం వైకుంఠాధీశుడులాగా చిద్విలాసం చేశాడు.

"ఇవే కాదోయ్ ... ఇలాంటి మాటలు చాలా పడుతుంటాయ్ .. మమ్మల్ని కాస్త క్షమించి పారేయాలి" అన్నాడు హాస్యంగా.

అతగాడు అలా అనగానే మరికొన్ని అలాంటివి వినిపించాడు సుబ్రహ్మణ్యం.

"పాత కక్షలతో గడ్డివామిని దగ్ధం చేశారు"

"పాదరక్షలతోనే స్నానపు ఘట్టాలలోకి అడుగుపెట్టిన మంత్రి పవిత్ర గోదావరి పట్ల అపశృతికి పాల్పడ్డారు"

- ఈ రెండు వాక్యాలలోని పద ప్రయోగాలను చూద్దాం. దగ్ధం అంటే కాలిపోవడం, దహనం అంటే తగుల బెట్టడం. ఒకటి ప్రమాదవశాత్తూ జరిగేది, రెండోది ఉద్దేశపూర్వకంగానే చేసేపని.

పాతకక్షలతో చేసేపని ఉద్దేశంతో చేసేదే కాబట్టి దహనం అని రాయాలి. అసలు అందరికీ అర్థమయ్యేట్లు తగులబెట్టారు అని రాస్తే సరిపోతుంది కదా!

ఇక 'పవిత్ర గోదావరిలోకి పాదరక్షలతో అడుగుపెట్టి మంత్రి 'అపశృతి'కి పాల్పడ్డారట!' ఇలా రాసినాయన కూడా భాష విషయంలో 'అపశృతికే పాల్పడ్డారు.

యాధృచ్ఛికంగా జరిగే పొరపాట్లను 'అపశృతి'గా రాయాలి. కావాలని పాల్పడితే 'అపచారం' అని రాయాలి. ఇక్కడ మంత్రిగారి గురించి చెప్పదలచుకున్నది 'అపచారం' అనే. కానీ రాసింది వేరు" అని సుదీర్ఘంగా వివరించాడు సుబ్రహ్మణ్య.

"చారిత్రాత్మక నీ కొంపలో చారిత్రక ఘట్టం ఈ డిస్కషన్, ఇంక సెలవు" అన్నాడు కైలాసం డ్రమెటిక్‌గా.

అదిగో అక్కడే వచ్చింది సమస్య. బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. చారిత్రక అంటే గతానివి ... చారిత్రాత్మక ... అంటే వర్తమానానివి ..." అంటూ వివరించబోయాడు సుబ్రహ్మణ్యం.

'తెలుసు మహాప్రభో ... సరదాకన్నాను" చేతులెత్తేశాడు కైలాసం. ●

పాఠక స్పందన

మనసును కదిలించిన 'రియల్ స్టోరీ'

10 ఆగస్ట్ 2003 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన చదవని ఉత్తరం చదువుతుంటే మా హృదయం ద్రవించిపోయింది. మా మనసంతా దిగులుతో దిగజారిపోయే విధంగా ఉండడంతో మేము ఎంతో నిరాశా నిస్పృలకు గురయ్యాము.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

విశ్లేషణ బాగుంది

ఆగస్టు 3వ తేదీ ఆదివారం అనుబంధంలోని అంశాలు ఆలోచింపచేసేవిగా వున్నాయి. ముఖ్యంగా కవర్ స్టోరీ 'చంద్రబాబు పాలనపై విశ్లేషణ' బాగుంది. అప్పులు తెచ్చి వాటితో 'తమవారికందరికి' పంపకాలు చేస్తూ 'అదే అభివృద్ధి' అంటూ మాయమాటలు పలుకుతుంటే నమ్మేకాలం పోయింది. కార్టూన్ జోక్స్ బాగున్నాయి. 'మా తల్లి గోదారి'లో చాదస్తంగా బురద నీటిలో మునిగి రోగాలు తెచ్చుకోకుండా ఆరోగ్య సూచనలు చక్కగా వివరించారు.

- షీలా కృష్ణవేణి, జంగారెడ్డిగూడెం

ఆడపిల్ల దేవుడిచ్చిన వరమే

ఆగస్టు 10 ఆదివారం అనుబంధంలో 'కొడుకు పుట్టాల' అనే సంపాదకీయం ప్రతి ఒక్కరూ చదవాల్సిందే. పుట్టింది ఆడపిల్ల అనేసరికి చాలా అవలీలగా తీసిపారేస్తారు. కానీ కష్టకాలంలో మగబిడ్డ, చేయలేని పనులు కూడా చేసేది ఆడపిల్లేనని గుర్తించరు. చదవని ఉత్తరం రియల్‌స్టోరీ చదివిన మాకు ఒక్కసారిగా మా గుండెల్ని పిండేసినట్లయింది. మనో ధైర్యం లేని జీవితాలు ఎలా బలైపోతున్నాయోనని. అందుకే చెడి బతికిన వాడికన్నా బతికి చెడిన వాడు బతకడం కష్టమంటారు పెద్దలు

- డి.వి.రెడ్డి, గవరపాలెం, అనకాపల్లి.

చదివింప చేసిన 'ఆరోగ్యం'

ఆగస్టు 10 ఆదివారం అనుబంధంలో ఆరోగ్యం శీర్షికన ప్రచురించిన 'తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం' వ్యాసం ఆద్యంతం ఆసక్తితో చదివింప చేసింది. తల్లిపాలకున్న మహత్యం ఎవరికీ తెలియంది కాదు. అయినా కొందరు సౌందర్యం కొరవడుతోందని, బిడ్డలకు పాలివ్వకూడదని 'అవాస్తవ భ్రమల' నడుమ ఊగిసలాడుతూ కన్న బిడ్డలకు జన్మతః లభించిన హక్కును హరించి వేస్తున్నారు. ఇది ఎంతో దారుణ విషయం. తల్లిపాల వల్ల ఎవరెవరికి ఎంతెంత లాభమో చాలా విపులంగా వివరించినందుకు థాంక్స్. తల్లిపాలను వ్యతిరేకించే వారికిది ఓ గుణపాఠం కావాలి.

- ఎం.డి.ముస్తఫీమ్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ఫోకస్

ఫోటో : కె.నరహరి